Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in


సంపుటి : 1 సంచిక : 216 మేడ్చల్ మల్కాజ్‌గిరి 26 ఆగస్టు 2023 శనివారం పేజీలు : 4

## రాష్ట్ర వ్యాప్తంగా 'అల్పాహార పథకం'

చెన్నై : రాష్ట్రంలో సీఎం బడిపిల్లల అల్పాహార పథకాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేయడానికి రంగం సిద్ధమైంది. గత యేడాది సెప్టెంబర్ 15న మాజీ ముఖ్యమంత్రి అన్నాదురై జయంతి సందర్భంగా ప్రయోగాత్మకంగా 1500 ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ప్రారంభించిన ఈ అల్పాహార పథకానికి మంచి స్పందన లభించింది. విద్యార్థుల హాజరు రోజురోజుకూ పెరిగింది. దీంతో ఈ పథకాన్ని యేడాది తిరగకముందే రాష్ట్రవ్యా ప్తంగా విస్తరింపజేయాలని ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయించారు. ఆ మేరకు నెల రోజులుగా అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో ఉదయం పూట అల్పాహార పథకాన్ని అమలు చేయడానికి తగు ఏర్పాట్లు జరుగుతున్నాయి. వంటలను శుచిగా శుభ్రంగా తయారు చేయడానికి ప్రత్యేకమైన వంటగదులను ఎంపిక చేశారు.

# 'వారసుడొచ్చాడు'

# మోదీ తర్వాత అమిషానే!



నరేంద్ర మోడీ. ఇప్పటికి రెండున్నర దశాబ్దాలుగా ముఖ్యమంత్రిగా ప్రధానిగా పాలన చేస్తూ వస్తున్న నేత. అలుపెరగని నాయకుడిగా పేరు. ఆయన ఈ రోజుకీ సెలవు అన్న మాట ఎత్తకుండా నిరంతరం పనిలోనే ధ్యాస పెడుతున్న లీడర్. నరేంద్ర మోడీ వయసు అక్షరాలా డెబ్బై మూడేళ్ళు. బీజేపీ పార్టీ పెట్టుకున్న నిబంధనల ప్రకారం చూస్తే మరో రెండేళ్లలో ఆయన ప్రధాని పదవి నుంచి దిగిపోవాల్సిందే. ఏడున్నర పదుల వయసు దాటితే ఎవరైనా కీలక పదవుల నుంచి దూరం కావాలని నరేంద్ర మోడీ వచ్చాక బీజేపీ పెట్టిన ఒక కఠిన నిబంధన. దాని పుణ్యాన ఎల్కే అద్వానీ, మురళీమనోహర్ జోషీ వంటి పెద్దలు అంతా తెర మరుగు అయ్యారు. ఇక మోడీ విషయానికి వస్తే ఆయన పుట్టిన రోజు సెప్టెంబర్ 17. ఆనాటికి ఆయన 73 ఏళ్ళు పూర్తి చేసుకుని 74వ ఏట అడుగు పెడతారు. ఇక దేశంలో ఎన్నికలు 2024 మేలో జరుగుతాయి. ఇపుడున్న పరిస్థితులు సర్వేలు అన్నీ చూస్తే మోడీయె మరోసారి ప్రధాని అయ్యే అవకాశాలు ఉన్నాయి. అలా హ్యాట్రిక్ పీఎం గా మోడీ రికార్డు క్రియేట్ చేయనున్నారు. అయితే 2025 సెప్టెంబర్ 17 నాటికి ఏడున్నర పదుల వయసు నిండనున్న మోడీ ఆనాటికి తన పదవిని త్యాగం చేస్తారా అన్నది కొత్త చర్చ. మోడీ వచ్చాక బీజేపీలో వ్యక్తి పూజ అధికం అయింది. మోడీతోనే విజయాలు పరాజయాలు అన్నట్లుగా పరిస్థితి ఉంది. మోడీయే బీజేపీ అన్నట్లుగా కూడా పార్టీ ఉందని అంటారు.

అటువంటి మోడీ కనుక పదవులు వద్దు అనుకుంటే ఆయన రాజకీయ వారసులు ఎవరు అన్న చర్చ అయితే ఉంది. అప్పట్లో బీజేపీని వాజ్ పేయ్ అద్వానీ కలసి నిర్మించారు. ఈ ఇద్దరూ కలసి బీజేపీని పటిష్టం చేశారు. వాజ్ పేయ్ వారసుడిగా అద్వానీ పేరు మారుమోగింది. కానీ ప్రజలు మాత్రం నరేంద్ర మోడీని ఎన్నుకున్నారు. అలా వాజ్ పేయ్ వారసుడు మోడీ అయ్యారు. ఇపుడు కూడా ప్రజలు ఎవరిని మోడీ వారసుడుగా ఎవరిని గుర్తిస్తున్నారు అంటే చాలా పేర్లు ఉన్నాయి. ఈ రోజుకు అయితే కేంద్ర హెూం మంత్రి అమిత్ షాకే ఎక్కువ మంది ఓటు చేశారు. ఆయన పట్ల 29 శాతం జనాలు మొగ్గు చూపారు. మోడీ ప్రధాని పదవి వద్దు అనుకుంటే అమిత్ షాయే వారసుడు అని తేల్చారు. ఆ తరువాత ప్లేస్ లో అంటే 26 శాతం ఓటింగుతో యూపీ సీఎం ఆదిత్యానాథ్ యోగీజీ ఉన్నారు. ఇక మూడవ ప్లేస్ లో నితిన్ గడ్కరీ ఉన్నారు. ఆయనకు 15 శాతం ప్రజలు ఓటు చేశారు. అంటే ప్రధాని పదవికి వీరిలో ఒకరు కచ్చితంగా అర్హులు అవుతారు అని ప్రజలు అభిప్రాయపడ్డారన్న మాట. మూడ్ ఆఫ్ ది నేషన్ పేరిట ఇండియా టు డే సీ ఓటర్ చేసిన సర్వేలో ఈ విషయాలు వెల్లడి అయ్యాయి. ఇక ఆరెస్సెస్ బీజేపీలోని చాలా మంది భావన బట్టి చూస్తే మోడీ వారసుడిగా యోగీకే ఎక్కువ మార్కులు వస్తాయని చెబుతారు. ఎందుకంటే ఆయన రెండు సార్లు వరసగా యూపీ సీఎం గా ఉన్నారు. అంతే కాదు ప్రజాదరణలో తిరుగులేదు, హిందూత్వ భావజాలానికి ఊపిరిగా ఉన్నారు. యూపీలో మొత్తం 80 ఎంపీ సీట్లు ఉన్నాయి. అంతటి పెద్ద రాష్ట్రానికి చెందిన వారే ప్రధాని రేసులో అగ్ర భాగాన ఉంటారు. అంటే నిజంగా 2024లో బీజేపీ గెలిచి మోడీ ప్రధాని అయి 2025 సెప్టెంబర్ తరువాత ఆయన పదవీ విరమణ చేయాల్సి వస్తే మాత్రం యోగీకే ఎక్కువ చాన్సులు అన్నది ఒక నిజమైన విశ్లేషణగా ఉంది. ఇక అమిత్ షా గుజరాత్ రాష్ట్రానికి చెందిన వారు. ఆయన వ్యూహాలలో దిట్ట. కానీ ప్రజాదరణ విషయంలో వెనకబడి ఉంటారని అంటారు. అలాగే నితిన్ గడ్కరీని తీసుకుంటే మహారాష్ట్రకు చెందిన వారు. అక్కడ బీజేపీకి పూర్తి బలం లేదు. పైగా నితిన్ గడ్కరీ మంచి పాలనాదక్షుడు తప్ప జనాదరణలో ముందు వరసలో ఉండరని అంటున్నారు. ఎలా చూసుకున్నా బీజేపీలో మోడీ హవా 2029 దాకా కొనసాగడం ఖాయం. ఆ తరువాతనే వారసుల కథ ముందుకు వస్తుంది. అపుడు కచ్చితంగా యోగీజీయే ప్రధాని రేసులో వారసుడిగా ముందుంటారు అని అంటున్నారు.

# యోగీకి నో ఛాన్స్!

## మా సీఎం అభ్యర్థి కేసీఆర్.. మరి మీ సీఎం అభ్యర్థి ఎవరు ? ఎమ్మెల్సీ కవిత

ఆర్మూర్ : బీఆర్ఎస్ సీఎం అభ్యర్థి కేసీఆర్ అని, మరి మీ సీఎం అభ్యర్థి ఎవరో చెప్పాలని కాంగ్రెస్, బీజేపీ పార్టీలను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. వ్యవసాయానికి మూడు గంటలు మాత్రమే కరెంట్ చాలంటున్న కాంగ్రెస్ కావాలా లేదా 24 గంటల నిరంతర విద్యుత్తు అందిస్తున్న సీఎం కేసీఆర్ కావాలా అన్నది రైతులు ఆలోచించుకోవాలని కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవసాయ మోటార్లకు మీటర్ల పెట్టమంటున్నదని మండిపడ్డారు. కార్పొరేట్ కంపెనీలకు రూ.15 లక్షల రుణమాఫీ చేసిన బీజేపీ ప్రభుత్వం రైతు రుణమాఫీకి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని తెలిపారు. ఆర్మూర్ బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశంలో పాల్గొనడానికి విచ్చేసిన కవిత పెర్కిట్ చౌరస్తాలో కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. మూడో సారీ ఎమ్మెల్యేగా పోటీ చేయడానికి టికెట్ పొందిన తర్వాత మొదటి సారి జీవన్ రెడ్డి ఆర్మూర్ కు వచ్చారని, ఆయనను ఆశీర్వదించడానికి వచ్చిన అందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఏ ఫర్ ఆర్మూర్, ఏ ఫర్ ఆశన్నగారి జీవన్ రెడ్డి 2014లో మొదటి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రకటించుకున్నామని గుర్తు చేశారు. 'ఏ ఫర్ ఆర్మూర్, ఏ ఫర్ ఆశన్నగారి జీవన్ రెడ్డి' అని వ్యాఖ్యానించారు. 2014లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలపొంది జీవోల జీవన్ రెడ్డిగా పేరు తెచ్చుకున్నారని, రెండో సారి 30 వేల మెజారిటీతో ప్రజలు ఆయనను ఎమ్మెల్యేగా గెలిపించారని తెలిపారు.

ఇప్పుడు ముచ్చటగా మూడో సారి సీఎం కేసీఆర్ టికెట్ ఇచ్చారని, ఈ సారి కచ్చితంగా 60 వేల మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. గత ఏడాదిన్నర కాలం నుంచి జీవన్ రెడ్డి సీఎం కేసీఆర్ తోనే ఉంటున్నారని, నీడలాగా నిరంతరం సీఎంతో కలిసి పనిచేస్తున్నారని స్పష్టం చేశారు. అలాగే, ఆకుల లలిత పార్టీలో చేరిన తర్వాత ఆమెను గౌరవించుకున్నామని, ఆమెకు భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు ఇస్తామని స్పష్టం చేశారు. జీవన్ రెడ్డిని ఆశీర్వదించిన ఆకుల లలిత మరింత ఉన్నత స్థానంలో ఉంటారని తెలిపారు. ఆలూరు, డొంకేశ్వర్ ను మండల కేంద్రంగా చేశామని, ఆర్మూర్‌ను రెవెన్యూ డివిజన్ చేసుకున్నామని వివరించారు.

**అభివృద్ధి చేసిన హక్కుతో ఓట్లు అడుగుతున్నాం :** చెప్పిన ప్రతి ఒక్కటి చేసుకుంటూ వచ్చామని, చెప్పిన పని చేస్తూ నిరంతరం అభివృద్ధికి కృషి చేస్తున్నందునే.. ఒక హక్కుతో ప్రజల వద్దకు వెళ్లి ఓట్లు అడగాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. కాంగ్రెస్ పార్టీ



నాయకులు ఏవేవో పెద్ద మాటలు మాట్లాడుతున్నారని, పీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వ్యవసాయానికి కేవలం మూడు గంటల విద్యుత్తు సరిపోతుందని అంటున్నారని, మూడు గంటల కరెంట్ సరిపోతుందా అని ప్రశ్నించారు.

కాంగ్రెస్ వాళ్లేమో మూడు గంటల కరెంట్ చాలంటే..బీజేపీ వాళ్లేమో మోటార్లకు మీటర్లను పెట్టమంటున్నారని విమర్శించారు.




## వెయ్యి కార్లు, 2 వేల బైక్‌లతో.. తుమ్మలకు ఘన స్వాగతం

ఖమ్మం జిల్లా సరిహద్దు నాయకన్ గూడెం వద్ద మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కు అభిమానులు ఘన స్వాగతం పలికారు. దాదాపు వెయ్యి కార్లు, 2 వేల బైక్‌లతో ఆయన ఖమ్మం బయలుదేరి వెళ్లారు. భారాస ప్రకటించిన అభ్యర్థుల తొలి జాబితాలో తుమ్మల పేరు లేకపోవడంతో.. ఆయన అనుచరులు భగ్గుమంటున్నారు. పార్టీ మారి పాలేరు నుంచి పోటీ చేయాలని ఏకాభిప్రాయంతో ఉన్నారు.




# 'రాజకీయ కూలీ'లకు ఫుల్ డిమాండ్

## రోజుకు ఎంతో తెలుసా?

రంగారెడ్డి : రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గంలో ఇప్పుడు 'రాజకీయ' కూలీలకు భలే గిరాకీ ఏర్పడింది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు ఒకే రోజు (శనివారం) నిర్వహించే బహిరంగ సభలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకోవడమే ఇందుకు కారణం. ఎన్నికలకు ముందు నిర్వహిస్తున్న ఈ సభలను విజయవంతం చేసేందుకు రెండు పార్టీలు పోటీపడుతున్నాయి. జనసమీకరణకు పార్టీ నాయకత్వాలు టార్గెట్ పెట్టడంతో స్థానిక నేతల కష్టాలు అన్నీ ఇన్నీ కావు. బడా, చోటా నేతలంతా జనసమీకరణకు కోసం గ్రామాల్లో తిష్టవేస్తున్నారు. మా సభకు రండి... మా సభకు రండి అంటూ జనాన్ని బతిమాలుతున్నారు. దీంతో శనివారం నియోజకవర్గంలో కూలీలకు డిమాండ్ పెరిగింది. భోజనం, రవాణ సౌకర్యాలు కల్పించడంతో పాటు ఒక్కొక్కరికీ రూ.1000 వరకు చెల్లిస్తున్నారు. జనాన్ని తరలించేందుకు సన్నాహక సమావేశాలు కూడా నిర్వహిస్తున్నారు. ఈ నెల 26న స్వతంత్ర భారత వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా ఆ రోజు రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కలు నాటాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు చిల్కూరు అటవీ భూముల్లో ప్రభుత్వం తెలంగాణకు హరితహారం కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం కేసీఆర్ చిల్కూరు ఫారెస్ట్ ట్రెక్ పార్కులో మొక్కలు నాటనున్నారు. ఈ సందర్భంగా ఇక్కడ భారీ బహిరంగసభ నిర్వహించనున్నారు. ఇది ప్రభుత్వ కార్యక్రమమే అయినా జనసమీకరణ బాధ్యతలను బీఆర్ఎస్ నాయకత్వానికి అప్పగించారు. అదేరోజు సమీపంలోని చేవెళ్లలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్న నేపథ్యంలో బీఆర్ఎస్ కూడా సీఎం సభకు పెద్దఎత్తున జనాన్ని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ శనివారం సాయంత్రం 4గంటలకు చేవెళ్లలో ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ బహిరంగ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గేతో పాటు పలువురు జాతీయ నేతలు హాజరు కానున్నారు. ఖర్గే హాజరవుతుండడం, చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెసకు సెంటిమెంట్ కావడంతో ఈ సభపై కాంగ్రెస్ ప్రత్యేక దృష్టి కేంద్రీకరిస్తోంది. లక్షమందితో ఈ సభను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కాంగ్రెస్ ప్రకటించింది. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి మాణిక్‌రావు ఠాక్రే సభ ప్రాంగణానికి వచ్చి పరిశీలించారు.

# సంపాదకీయం

## 'మరోసారి సర్జికల్ స్ట్రైక్'

సర్జికల్ స్ట్రైక్... ఒకప్పుడు ఆ పదం సృష్టించిన అలజడి అంతా ఇంతా కాదు. 2016 లో ఈ పదం దేశ ప్రజల రోమాలు నిక్కబొడుచుకునేలా చేస్తే... పాక్ కి కంటిమీద కునుకులేకుండా చేసిందని చెబుతారు. ఈ సమయంలో మరోసారి సర్జికల్ స్ట్రైక్ వార్తలు తెరపైకి వచ్చాయి. దీంతో ఈ విషయాలపై రక్షణ శాఖ స్పందించింది. అవును... భారత సైన్యం మరోసారి పాకిస్థాన్ పై సర్జికల్ స్ట్రైక్ చేసినట్లు వచ్చిన వార్తలపై భారతదేశ రక్షణ మంత్రిత్వ శాఖ స్పందించింది. ఈ వార్తలను తాజాగా తోసిపుచ్చింది. అయితే నియంత్రణ రేఖ వెంబడి పాకిస్థాన్ నుంచి ఉగ్రవాదుల చొరబాటు యత్నాన్ని భారత సైన్యం విఫలం చేసినట్లు తెలిపింది. భారత దేశ రక్షణ మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసిన ప్రకటనలో... బాలాకోట్ సెక్టర్, హమీర్ పూర్ ప్రాంతంలో ఉదయం వాతావరణం దట్టమైన పొగమంచుతో కూడి ఉందని.. ఆ సమయాన్ని ఇద్దరు ఉగ్రవాదులు అనుకూలంగా భావించారని.. దీంతో భారతదేశంలోకి చొరబడేందుకు ప్రయత్నించారని.. వీరిని మన సైన్యం గుర్తించిందని తెలిపింది. ఉగ్రవాదులు చొరబండేందుకు చేసిన ప్రయత్నాలను సైన్యం అడ్డుకోవడంగానే ఈ చర్యను చూడాలని రక్షణశాఖ కోరింది. ఇది సర్జికల్ స్ట్రైక్ కాదని వివరించింది. పాక్ ఉగ్రవాదులు దొరికిపోయిన ప్రాంతంలో జరిపిన సోదాల్లో రెండు మ్యాగజైన్ లు, రెండు గ్రెనేడ్ లు, ఏకే 47 రైఫిల్ లభ్యమయ్యాయని చెప్పింది. ఇదిలావుండగా... పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీరులో భారత సైన్యం మరోసారి సర్జికల్ స్ట్రైక్స్ చేసిందని వార్తా పత్రిక తెలిపింది. భారత సైన్యం ఆగస్టు 19 రాత్రి నియంత్రణ రేఖ వెంబడి పాక్ ఆక్రమిత కశ్మీరులోకి 2.5 కిలోమీటర్లు వెళ్లిందని.. ఆ సమయంలో పాకిస్థానీ ఉగ్రవాదులకు చెందిన నాలుగు లాంచింగ్ పాడ్ లను ధ్వంసం చేసిందని తెలిపింది. ఇదే సమయంలో భారత సైన్యం జరిపిన ఆ సర్జికల్ స్ట్రైక్ లో సుమారు ఎనిమిది మంది ఉగ్రవాదులు మరణించినట్లు తెలిపింది. ఇదే సమయంలో భారత సైనికులంతా సురక్షితంగా తిరిగి వచ్చారని తెలిపింది. అయితే ఈ వార్త వెలుగులోకి వచ్చిన కొద్ది గంటల్లోనే రక్షణ మంత్రిత్వ శాఖ స్పందించింది. ఇది అవాస్తవమని వివరణ ఇచ్చింది. కాగా... 2016 సెప్టెంబరు 18న ఉరీ పట్టణానికి సమీపంలో ఉన్న సైనిక స్థావరంపై నలుగురు సాయుధ మిలిటెంట్లు దాడి చేసిన సంగతి తెలిసిందే. ఈ దాడిలో 19 మంది భారత సైనికులు మరణించారు. ఈ సమయంలో దాడి చేసినది పాకిస్తాన్ కు చెందిన ఉగ్రవాద సంస్థ జైషే మహమ్మద్ అని భారత్ ఆరోపించింది. అనంతరం ఉరీ దాడి జరిగిన పదకొండు రోజుల తర్వాత సెప్టెంబరు 29న, భారత సైన్యం పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్ లో ఉన్న అనుమానిత ఉగ్రవాదులపై సర్జికల్ స్ట్రైక్స్ నిర్వహించింది. సెప్టెంబరు 30న భారత సమాచార, ప్రసార మంత్రి రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్ ఈ దాడుల్లో వైమానిక దాడులు జరగలేదని, మొత్తం ఆపరేషన్ అంతా నేలపైనే నిర్వహించామనీ చెప్పారు! అయితే ఈ విషయాలపై స్పందించిన పాక్... సర్జికల్ దాడులేమీ జరగలేదని చెప్పుకొంది. దాడి జరిగిన వెంటనే సాక్ష్యాలను చెరిపివేయడానికి పాకిస్తాన్ సైన్యం హతమైన ఉగ్రవాదుల శవాలను పాతిపెట్టిందని భారత నిఘా వర్గాలు పేర్కొన్నాయి. ఈ సర్జికల్ దాడుల్లో పాల్గొన్న పంతొమ్మిది మంది సైనికులకు భారత ప్రభుత్వం శౌర్య పురస్కారాలను ప్రదానం చేసింది. వారిలో ఆపరేషన్ నాయకుడు మేజర్ రోహిత్ సూరి రెండవ అత్యున్నత శాంతికాల శౌర్య పురస్కారమైన కీర్తి చక్ర అందుకున్నాడు!

# యథేచ్ఛగా నీటి చౌర్యం



ఖమ్మం : ఉభయ జిల్లాల్లోని నగర, పురపాలకాల్లో వేసవిలో నీటి ఎద్దడి నిత్య సమస్యగా మారుతుంది. కొన్ని కాలనీలతో పాటు శివారు ప్రాంతాల్లో ఇళ్లకు అరకొరగా మంచినీరు సరఫరా అవుతుంది. కుళాయిలపై ఆధారపడే పేదలు తరచూ తమ ఆవేదనను అధికారులకు విన్నవిస్తున్నా పరిష్కారం దొరకడం లేదు. కొందరు పై ప్రాంతాల వారు కుళాయిలకు విద్యుత్తు మోటార్లు బిగిస్తూ నీళ్లు తోడేస్తున్నారు. కొత్తగూడెం, పాల్వంచ వంటి పట్టణాలకు చెంతనే కిన్నెరసాని తాగునీటి పథకం, ఆపై 'మిషన్ భగీరథ' జలాలు సరఫరా అవుతున్నా దాహార్తి తీరని పరిస్థితులున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఉభయ జిల్లాల్లోని పలు పట్టణాల్లోనూ నీటి చౌర్యం యథేచ్ఛగా జరుగుతోంది. వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో అధికారులు దీనికి అడ్డుకట్ట వేయాల్సిన అవసరం ఉంది.

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మొత్తం 69,520 కుళాయిలు ఉన్నాయి. సగటున ప్రతి వందలో 15 కుళాయిలకు నేరుగా విద్యుత్తు మోటార్లు బిగిస్తున్నారని అనధికారిక అంచనా. దీని ప్రకారం నీటిని తోడేస్తున్న కనెక్షన్లు సుమారు 10 వేల వరకు ఉంటాయని తెలుస్తోంది. నీటి సరఫరా సమయంలో జలాలను లాగేస్తుండటంతో చివరి ప్రాంతాల వారికి సన్నటి ధారలే దిక్కుగా మారుతున్నాయి. ఎక్కువగా మురికివాడలు, దిగువ మధ్యతరగతి వారు నివాసం ఉంటున్న ప్రాంతాల్లో సమస్య ఉంది. కొందరు తమ ఇళ్లలో బోర్లు ఉన్నా.. ఉచితమే కదాని కుళాయి నీళ్లను తోడేస్తున్నారు. భారీ వాటర్ ట్యాంకులు నింపుకొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యం నీటి చౌర్యంపై అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. సరఫరా సమయంలో వార్డుల్లో తనిఖీల నిర్వహణను పూర్తిగా మరిచారు. అక్రమ కుళాయిలనూ తొలగించే పరిస్థితి లేదు. ఫలితంగా పురపాలకంపైనా ప్రభావం పడుతోంది. కొందరు వ్యక్తులు స్థానిక పురపాలకాల సిబ్బంది సహకారంతోనే అక్రమంగా కనెక్షన్లు ఏర్పాటు చేసుకుని.. ఆపై మోటార్లు సైతం బిగించుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఇకనైనా ఈ సమస్యపై దృష్టిపెట్టి కఠిన చర్యలు తీసుకుంటేనే తాగునీటి వెతలు తప్పుతాయి.

'పురపాలకంలో నీటి సరఫరాకు అంతరాయం కలిగించే వారిపై దృష్టిసారిస్తాం. ఎవరైనా అక్రమంగా మోటార్లు బిగిస్తే చర్యలు తప్పవు. సిబ్బందిని అప్రమత్తం చేస్తామని' కొత్తగూడెం పురపాలక డీఈ టి.నవీన్‌కుమార్‌తో అన్నారు.

# ఆశలు గాలికి..



ఖమ్మం : దేశవ్యాప్తంగా నూతనంగా 152 విమానాశ్రయాలను నిర్మించనున్నట్లు తాజా కేంద్ర బడ్జెట్ సమావేశాల్లో ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. తెలంగాణలో ఎన్నింటిని నిర్మిస్తున్నారో చెప్పాలని భారాస మహబూబాబాద్, చేవెళ్ల, పెద్దపల్లి ఎంపీలు మాలోత్ కవిత, బొర్లకుంట వెంకటేశ్ నేత, రంజిత్‌రెడ్డిలు అడిన ప్రశ్నకు కేంద్ర విమానయాన శాఖ మంత్రి జనరల్ వీకే సింగ్ బదులిచ్చారు. వరంగల్, ఆదిలాబాద్‌లలో బ్రౌన్ ఫీల్డ్, నిజామాబాద్ గ్రీన్‌ఫీల్డ్ విమానాశ్రయాలు త్వరలో అభివృద్ధి చేయనున్నట్లు సమాధానమిచ్చారు. భద్రాద్రి జిల్లా పాల్వంచలో గతంలో ప్రతిపాదించిన గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం సాంకేతికంగా అసాధ్యమని తేల్చిచెప్పారు. దీంతో 'కొత్తగూడెం విమానాశ్రయం' ఆశలపై నీళ్లు చల్లినట్లయింది.

రాష్ట్రంలోని వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెం, మహబూబ్‌నగర్, పెద్దపల్లి, నిజామాబాద్‌లో నూతన విమానాశ్రయాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా(ఏఏఐ)కు గతంలో ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ప్రతిపాదిత ప్రాంతాల్లో 'గరిష్ఠ వరదల స్థాయి' నివేదిక కోరుతూ ఏఏఐ అధికారులు రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ సీఈకి 2020లో లేఖ రాశారు. సీఈ ఆదేశాలతో ఆయా జిల్లాల ఆర్అండ్‌బీ ఎస్ఈలు నివేదికలు అందజేశారు. అన్నిచోట్ల సానుకూల పరిస్థితులున్నట్లు పేర్కొన్నారు. నివేదికల ఆధారంగా కొన్నాళ్లకు ఏఏఐ బృందం వచ్చి క్షేత్రస్థాయి సర్వే చేపట్టింది. బృందం నివేదిక ఆధారంగా తాజాగా పార్లమెంటు సమావేశాల్లో సివిల్ ఏవియేషన్ మంత్రి మరింత స్పష్టత ఇచ్చారు. వరంగల్, ఆదిలాబాద్, నిజామాబాద్‌లలో సాంకేతికంగా ఇబ్బందుల్లేవన్నారు. అక్కడ ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు నిర్ణీత గడువులోగా స్థల సేకరణ చేపట్టాలన్నారు. కొత్తగూడెం ఎయిర్‌పోర్ట్‌కు మాత్రం సాంకేతిక గుర్తింపు లేదన్నారు. 1,600 ఎకరాలు చూపినా...కేంద్రం 2016లో 'ఉడాన్' (ఉడో దేశ్‌కీ ఆమ్ నాగరిక్) పథకాన్ని ప్రారంభించింది. హిందీ భాషలో 'విమానం' అని అర్థం. విమాన ప్రయాణాన్ని సరసమైన ధరలకే అన్ని ప్రాంతాల ప్రజలకు అందుబాటులోకి తేవడం, ఇప్పటికే ఉన్న ప్రాంతీయ విమానాశ్రయాలను మరింత విస్తరించడం

ఈ పథకం ఉద్దేశం. కొత్తగూడెంలో విమానాశ్రయ ఏర్పాటుకు లక్ష్మీదేవిపల్లి మండలంలోని పునుకుడుచెలక పరిధిలోనున్న 1,600 ఎకరాలను రెవెన్యూ అధికారులు చూపారు. ఏఏఐ అధికారులు రెండేళ్ల క్రితం క్షేత్రస్థాయి సర్వే చేశారు. ఆ స్థలమంతా 'వైల్డ్‌లైఫ్' పరిధిలో ఉండటంతో ప్రత్యామ్నాయంగా పాల్వం చ పట్టణం పరిధిలోని పిల్లవాగు, గుడిపాడు సమీపంలోని సర్వే నంబరు 999లో వెయ్యి ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అప్పటి జిల్లా కలెక్టర్ డా.ఎంవీ రెడ్డి పరిశీలించి ఎయిర్‌పోర్ట్ అథారిటీ వారికి సమాచారమిచ్చారు. ఆ సంస్థ అధికారులు కూడా పరిశీలించి వెళ్లారు. తీరా చూస్తే.. సాంకేతిక గుర్తింపు లేదని కేంద్ర విమానయాన శాఖ మంత్రి వెల్లడిం చారు. రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచన చేసి సాంకేతిక ఆటంకాలకు పరిష్కారం చూపితే విమానాశ్రయం కల నెరవేరే అవకాశం ఉంది.

# సైబర్ ఎర.. భద్రం జర!

భూపాలపల్లి : జిల్లాలో సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. అపరిచిత వ్యక్తులు ఒక్క ఫోన్‌కాల్‌తో డబ్బులు కొల్లగొడుతున్నారు. బాధితుల అమాయకత్వాన్ని ఆసరా చేసుకొని సాంకేతిక పరిజ్ఞానంతో బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు కాజేస్తున్నారు. తీరా మోసపోయామని తెలిసేసరికి బ్యాంకులో నగదంతా ఖాళీ అవుతోంది. బ్యాంకు ఖాతాల్లో కేవైసీ అప్‌డేట్‌ల పేరుతో నకిలీ యాప్‌లు, ఉద్యోగాల ప్రకటనలు, ఆర్థిక సహాయాలు, లింకులు పంపిస్తూ అనేక రకాలుగా మోసాలకు పాల్పడుతున్నారు. వీరి వలలో పడి అమాయక ప్రజలతో పాటు మహిళలు, విద్యావంతులు సైతం చేతులు కాల్చుకుంటున్నారు. సకాలంలో ఫిర్యాదులు చేస్తే కొంతవరకు న్యాయం జరుగుతున్నా.. ఆలస్యంగా స్పందించే వారికి విషయం చేయి దాటిపోతోంది. భూపాలపల్లి పట్టణానికి చెందిన ఓ మహిళ ఈ నెల 13న ఆన్‌లైన్‌లో ఓ లింక్‌ను ఓపెన్ చేసి చీరలను చూసింది. వెంటనే ఫోన్‌కు ఓ సందేశం వచ్చింది. క్రెడిట్ కార్డు ద్వారా తీసుకునే అవకాశం కల్పించామని, ఓటీపీ నంబరు తెలపాలని అపరిచిత వ్యక్తి సూచించారు. ఆ విధంగానే ఆమె తెలియజేశారు. వెంటనే అకౌంట్లో నుంచి రూ.57 వేలు డ్రా అయిపోయాయి. అకౌంట్ బ్యాలెన్సు చూసుకోగా ఖాళీ అయినట్లు గుర్తించి వెంటనే పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. భూపాలపల్లి ప్రధాన రోడ్డులో మైసమ్మ ఆలయం దగ్గర్లో ఉండే ఓ మహిళకు అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. మీ పేరిట పాస్‌పోర్టు కార్డులు నాలుగైదు జారీ అయి ఉన్నాయి.. మీకు పెద్ద సమస్య కాబోతోంది.. ఇబ్బందుల్లో ఇరుక్కుంటారని బెదిరించాడు.. వాటన్నింటినీ రద్దు చేయాలంటే మీ గూగుల్ పే అకౌంట్ నుంచి ఒక నంబర్ కొట్టాలని సూచించాడు. ఆ మహిళ అలాగే చేయడంతో రూ.95,499 డ్రా అయిపోయాయి. ఫోన్‌కు డబ్బులు డ్రా అయినట్లు సందేశం రావడంతో వెంటనే ఆ వ్యక్తికి ఫోన్ చేయగా నంబర్ స్విచ్ ఆఫ్ అయిపోయింది. లబోదిబోమంటూ ఠాణాలో ఫిర్యాదు చేశారు.

చరవాణినే కీలకం..

ఇటీవల సెల్‌ఫోన్ నంబరుకే అన్ని లింకై ఉండటంతో.. దీనిపైనే ఎక్కువగా నేరగాళ్లు దృష్టి సారించారు. మెసేజ్‌లు, షాపింగ్, గిఫ్టుల పేరిట ఏదో ఒక రకంగా నంబరును సేకరిస్తూ దానికున్న యూపీఐ ఐడీని తెలుసుకోవడానికి అనేక రకాల లింకులు సృష్టిస్తున్నారు. తెలిసీ తెలియక లింకు క్లిక్ చేస్తే చాలు వెంటనే బ్యాంకు ఖాతాల్లోంచి సొమ్ము మాయమవుతోంది. ఆధార్‌తోపాటు బ్యాంకు ఖాతాలు, భూముల వివరాలు, ఉద్యోగ సమాచారం.. ఏదైనా సెల్‌ఫోన్ నంబరుతోనే లింకై ఉండటంతో సైబర్ నేరగాళ్లకు మోసం చేయడం సులువవుతోంది.

బాధితులు ఇలా స్పందించాలి

సైబర్ క్రైం పోలీసుల దగ్గరికి వెళ్లి ఫిర్యాదు చేసేలోపే నేరగాళ్లు డబ్బును ఖాతాల నుంచి లాగేసుంటారు. ఇలాంటి మోసాలను ఆపి నేరగాళ్ల ఖాతాలను స్తంభింపచేసేలా కేంద్ర ప్రభుత్వం ఒక వ్యవస్థను రూపొందించింది. ఖాతాల నుంచి డబ్బు పోయినట్లు గుర్తించగానే వెంటనే కేంద్ర హోం శాఖ హెల్ప్‌లైన్ నంబరు 1930కి ఫోన్ చేయాలి. లేదా 100కు కాల్ చేయాలి. పోలీసులకు సమాచారం అందిస్తే వెంటనే నేరగాళ్ల ఖాతాను నిలిపివేసి.. తిరిగి బాధితుని ఖాతాలో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటారు.

ఈ జాగ్రత్తలు పాటించాలి.. చరవాణులకు వచ్చిన ఓటీపీ, ఇతర బ్యాంకు ఖాతాల వివరాలు ఎట్టి పరిస్థితుల్లోనూ అపరిచిత వ్యక్తులకు చెప్పొద్దు. బ్యాంకు అధికారులమంటూ ఫోన్ చేసి అడిగినా ఏమీ తెలపొద్దు.. వైఫైల ద్వారా నగదు లావాదేవీలు జరపకూడదు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే సంక్షిప్త సందేశాలను ఓపెన్ చేయకూడదు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని ఉంటే దాని జోలికి వెళ్లవద్దు. ఎక్కువ శాతం ఎస్బీఐ యోనో, కేవైసీ, పాన్‌కార్డు పేరుతో ఎక్కువగా మోసాలు జరిగే అవకాశం ఉంది. వీటి విషయంలో ఎవరికీ తమ సమాచారాన్ని షేర్ చేయవద్దు. డెబిట్ కార్డు, చరవాణి హ్యాక్ అయిందన్న అనుమానం రాగానే వెంటనే అంతర్జాల ఆధారిత కొనుగోళ్లు నిలిపివేయాలి. వ్యక్తిగత రుణాలు, ఉద్యోగాలు కల్పిస్తామనే ఫోన్లు, లింకులకు స్పందించొద్దు.

అప్రమత్తంగా ఉండాలి.. సురేందర్‌రెడ్డి, ఎస్పీ, భూపాలపల్లి

మొబైల్ వాడకంతో సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వాటిని నియంత్రించాలంటే అప్రమత్తంగా ఉండాలి. కొత్తగా, అనుమానం ఉన్న నంబర్లకు ఎట్టి పరిస్థితుల్లో స్పందించవద్దు. సైబర్ నేరగాళ్లు వివిధ రూపాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. లింకులు ఓపెన్ చేయవద్దు. బ్యాంక్ నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతాకు సంబంధించిన వివరాలు తెలపాలని అడుగుతారు. వివరాలు చెప్పకూడదు. ఒకవేళ మోసపోతే తక్షణమే పోలీసులను సంప్రదించాలి. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాం. అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులపై నిఘా ఉంచాం.

# ఈసారైనా 'కాకతీయ'ను కరుణిస్తారా!

వరంగల్ : రాష్ట్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తర్వాత రెండో పెద్ద వర్సిటీ కాకతీయ. ఉన్నత విద్యాప్రమాణాలతో విరాజిల్లుతున్న కేయూ ప్రస్తుతం ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఉద్యోగుల వేతనాలు చెల్లించడానికి ప్రతి నెలా అవస్థలు పడుతోంది. ఈసారి బడ్జెట్‌లో నిధులు అధికంగా కేటాయించి గట్టెక్కించాలని ఇక్కడి అధ్యాపకులు కోరుతున్నారు. విశ్వవిద్యాలయాలనికి రావాల్సిన బ్లాక్ గ్రాంట్(ఉద్యోగుల వేతనాలకు చెల్లించేది) కింద రాష్ట్ర ప్రభుత్వం కేవలం రెగ్యులర్ ఉద్యోగులు, ఫించన్‌దారులకు మాత్రమే నిధులు ఇస్తోంది. దినసరి వేతనం, లంసమ్, తాత్కాలిక, టైంస్కేల్, ఒప్పంద ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావడం లేదు. నిధుల కోసం కేయూ ఉన్నతాధికారులు ప్రతి నెలా ఇతర విభాగాలపై ఆధారపడుతున్నారు.

అవసరం ఇలా.. : విశ్వవిద్యాలయంలో నెలకొన్న ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కడంపైనా, న్యాక్ బృందం పర్యటనను దృష్టిలో ఉంచుకొని కేయూ ఉపకులపతి ఆచార్య టి.రమేష్, రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాసరావు పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. భవనాలను మరమ్మతులు చేయడం, రంగులు వేయడం, అంతర్గత రోడ్లు అభివృద్ధి చేయడం లాంటి పనులు మొదలు పెట్టారు. వీటికి రూ.341 కోట్లు




అవసరమని రాష్ట్రప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. రూ.191 కోట్లు అభివృద్ధి పనులకు, రూ.150 కోట్లు ఉద్యోగుల వేతనాలకు అవసరం అవుతాయని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు.

గతంలో కేటాయింపులు ఇలా.. గత ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం బ్లాక్ గ్రాంట్ కింద కేవలం రూ.118 కోట్లు మాత్రమే కేటాయించింది. వీటిని ఫించన్‌దారులు, రెగ్యులర్ ఉద్యోగులకు వేతనాలు చెల్లించారు. ఏటా రూ.120 కోట్లకుపైగా రెగ్యులర్ అధ్యాపకులకే వేతనాల రూపంలో చెల్లించాల్సి వస్తోంది. విశ్వవిద్యాలయాల అభివృద్ధి కోసం నాలుగేళ్ల నుంచి ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. 2018లో రూ.100 కోట్లు 2019లో రూ.50 కోట్లు, 2020లో రూ.50 కోట్లు కేటాయించినా విడుదల చేయలేదు. 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో అసలు కేటాయింపులే లేవు.

# మోడువారిన జాతీయ రహదారి!

వరంగల్ : హైదరాబాద్- వరంగల్ నగరాలను కలిపే జాతీయ రహదారి 163 ప్రారంభమై రెండున్నరేళ్లు పూర్తవుతోంది. ఒకప్పుడు భారీ వృక్షాలతో కళకళలాడింది. ఇప్పుడు ఇరువైపులా ఇప్పుడు ఒక్క చెట్టూ కనిపించదు. విస్తరణలో భాగంగా సుమారు 4700 భారీ వృక్షాలను నరికేశారు. ఇందులో వందల సంఖ్యలో వేప చెట్లు ఒక్కోటీ 50 ఏళ్ల పైబడినవి ఉండేవి. జాతీయ రహదారుల ప్రాధికారిక సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ).. చెట్లను తొలగించినందుకు 'వాల్టా' చట్టం కింద ఒక్కోదానికి రూ.500 పరిహారం అటవీశాఖకు చెల్లించింది. ఒక్కటి నరికేస్తే దాని స్థానంలో రెండు మొక్కలను పెంచాలనే నిబంధన ఉంది. రహదారి పనులు పూర్తయ్యాక అటవీ శాఖ నామమాత్రంగా మొక్కలను పెట్టి వదిలేసింది. వారి నిర్లక్ష్యం వల్ల అవి ఇప్పటికీ ఎదగలేదు. ఉద్యమం చేసినా లాభం లేదు

ఒకప్పుడు వరంగల్- హైదరాబాద్ జాతీయ రహదారికి ఇరువైపులా మర్రి, రావి, వేప లాంటి అనేక వృక్షాలు ఉండేవి. వాహనదారులు ప్రయాణంలో అలసట చెందితే కాసేపు పక్కకు నిలిపి, వాటి కింద సేదదీరేవారు. దీన్ని విస్తరించే సమయంలో భారీ వృక్షాలను తొలగించకుండా 2017లో 'నీమ్స్ చిప్కో' అనే స్వచ్ఛంద సంస్థ పెద్ద ఉద్యమమే చేపట్టింది. ఇందులో వరంగల్ నిట్ విద్యార్థులు భాగస్వాములయ్యారు. జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలో చెట్లను నరికేసే చోటకు వెళ్లి కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. నరికివేయకుండా భారీ వృక్షాలను మరోచోటికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయాలని లోకాయుక్తను కూడా ఆశ్రయించారు. అధికారులు ఇవేవీ



పట్టించుకోలేదు. మరోవైపు మళ్లీ మొక్కలను పెంచుతున్నారంటే అదీ లేదు. ఇటీవల కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ రహదారి మధ్యలో సుందరీకరణలో భాగంగా మొక్కలను పెంచుతోంది. ఇప్పటికే ఆరేపల్లి నుంచి పెద్దపెండ్యాల వరకు పనులు పూర్తయ్యాయి. ఇరువైపులా రావాల్సిన భారీ వృక్షాలు మాత్రం ఇప్పట్లో పెరిగే పరిస్థితి కనిపించడం లేదు. మరోచోటికి మార్చవచ్చువృక్షాలను నరికేయడం తప్పకుంటే వాటిని మరో చోటికి మార్చే సాంకేతికత కూడా అందుబాటులోకి వచ్చింది. దీన్ని ట్రాన్స్‌లోకేషన్ అంటారు. ఇటీవల హైదరాబాద్ బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ సమయంలో కొన్ని వృక్షాలను అధికారులు, పర్యావరణ ప్రేమికుల సహకారంతో మరోచోటికి మార్చారు. వరంగల్ పాత కారాగారం కూల్చేసి ఆసుపత్రిని నిర్మిస్తున్నారు. ఇక్కడ కూడా అనేక వృక్షాలను నరికేయకుండా ఈ ఆవరణలో మరోచోటికి మార్చారు. ప్రత్యామ్నాయాలు వెతకాలి- కొలిపాక ప్రకాశ్, వరంగల్‌రహదారుల విస్తరణ అభివృద్ధిలో భాగమే. ఈ నెపంతో వందల ఏళ్లనాటి చెట్లను నరికేస్తున్నారు. మళ్లీ మొక్కలను పెట్టి సంరక్షించడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. ఇప్పుడు వికారాబాద్ వద్ద మర్రి చెట్లను తీసేసేందుకు రంగం సిద్ధమైతే నేను ఓరుగల్లు నుంచి మన్నెగూడెం వరకు పాదయాత్ర చేశాను. భవిష్యత్తు తరాలకు ఆస్తిపాస్తులు ఇవ్వకున్నా, మంచి పర్యావరణాన్ని కానుకగా ఇవ్వాలి.

# ఆలయ స్థలంలో వెలిసిన జెండాలు

వరంగల్ : శ్రీభద్రకాళి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ సీతారామచంద్రస్వామి దేవుడి పేరుతో హనుమకొండ పెద్దమ్మగడ్డ శివారులో ఉన్న స్థలంలో రెండు రోజులుగా ఎర్ర జెండాలు, తాత్కాలిక గుడారాలు వెలిశాయి. హనుమకొండ మండలం పెద్దమ్మగడ్డలోని కేఎస్సార్ గార్డెన్ వెనకాల సర్వే నంబరు 479లో శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయం పేరుతో 3 ఎకరాల భూమి ఉంది. రెండు, మూడు రోజులుగా కొందరు ప్రైవేటు వ్యక్తులు జెండాలు పాతారని తెలియడంతో భద్రకాళి దేవస్థానం కార్యనిర్వహణాధికారిణి శేషుభారతి ఆధ్వర్యంలో ఉద్యోగులు పరిశీలించారు. దేవాలయానికి చెందిన భూమిలో ఎవరైనా ఆక్రమణకు ప్రయత్నిస్తే హిందూ దేవాదాయ ధర్మాదాయ శాఖ చట్టం 30/87 ప్రకారం శిక్షార్హులవుతారని ఈవో ఒక ప్రకటనలో తెలిపారు.

# హస్తం.. తగ్గేదేలే..!

వర్ధన్నపేట : భారాస.. సిట్టింగ్‌లకే టిక్కెట్లు ఖరారు చేసింది. వారిలో రెండు, మూడుసార్లు ఎమ్మెల్యేలుగా గెలిచిన వారు ఉన్నారు. అంగ, అర్థ బలం ఉన్నవారే. వారికి దీటైన అభ్యర్థులను బరిలోకి దించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం సీరియస్‌గా దృష్టి సారించింది. టీపీసీసీ తరఫున రెండు బృందాలు, మరో ప్రైవేటు సంస్థతో సర్వేలు చేయిస్తున్నారు. ఐదారు నెలలుగా వరంగల్ ఉమ్మడి జిల్లాలోని 12 శాసనసభ నియోజకవర్గాల్లో ఇప్పటికే రెండు, మూడు దఫాలుగా సర్వేలు చేసింది. తాజాగా మరో రెండు సర్వేల రిపోర్టులు వచ్చాయి. వీటి ఆధారంగా కాంగ్రెస్ అభ్యర్థులను ఖరారు చేయాలని చూస్తున్నారు. ప్రజల ఆశీర్వాదంతో పాటు అంగ, ఆర్థిక బలమున్న వారికి ఎమ్మెల్యే టికెట్లు ఇవ్వాలని చూస్తున్నారు. వచ్చే నెలలో మంచి ముహూర్తం చూసుకొని తొలి జాబితా విడుదల చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా హైదరాబాద్ గాంధీ భవన్‌లో ఆశావహుల నుంచి టీపీసీసీ దరఖాస్తులు స్వీకరిస్తోంది. త్వరలోనే ఒకే అభ్యర్థి రంగంలో ఉన్న నియోజకవర్గాల అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిసింది.

వరంగల్ తూర్పు

భారాస నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే నరేందర్ పేరు ఖరారైంది. ఇక్కడ కాంగ్రెస్ టికెట్ కోసం మాజీ మంత్రి కొండా సురేఖ, వరంగల్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ పోటీ పడుతున్నారు. ఒకరు మాజీ మంత్రి, మరొకరు మాజీ మేయర్. సామాజిక వర్గం ఓట్ల ఆధారంగా అభ్యర్థిని ఖరారు చేయాలని అధిష్ఠానం భావిస్తోంది.

కొండా సురేఖ 2014లో భారాస నుంచి పోటీ చేసి గెలుపొందారు. 2018లో తిరిగి కాంగ్రెస్‌లో చేరి పరకాలలో పోటీ చేసి ఓటమి చెందారు. ఈసారి తూర్పు నుంచే బరిలో ఉంటానని చెబుతున్నారు. ఎర్రబెల్లి స్వర్ణ 2005–10 వరకు నగర మేయర్‌గా పనిచేశారు. 2014లో వరంగల్ పశ్చిమలో పోటీ చేసి ఓటమి చెందారు. ఈసారి తూర్పు స్థానంపై దృష్టి సారించారు.

వరంగల్ పశ్చిమ



ఇక్కడ భారాస నుంచి దాస్యం వినయ్‌భాస్కర్ నాలుగుసార్లు గెలిచారు. ఆయన్ను ఢీ కొట్టే అభ్యర్థిని బరిలోకి దింపాలని కాంగ్రెస్ భావిస్తోంది. టికెట్ కోసం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి పోటీ పడుతున్నారు. రాజేందర్‌రెడ్డి పదేళ్లుగా జిల్లా పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. 2014, 2018లో టికెట్టు కోసం తీవ్రంగా ప్రయత్నించినా చివరి సమయంలో చేజారింది. ఈసారి ఆయనకు సానుకూల వాతావరణం ఉందని తెలిసింది.

మాజీ డీసీసీబీ ఛైర్మన్ జంగా రాఘవరెడ్డి 2018లో పాలకుర్తి నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. నాలుగేళ్ల పాటు జనగామ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. ఈసారి పశ్చిమ నుంచి బరిలోకి దిగాలని చూస్తున్నారు. మంగళవారం టికెట్టు కోసం దరఖాస్తు చేశారు.

పరకాలసిట్టింగ్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి రెండుసార్లు గెలిచారు. ఆయనకు గట్టి పోటీ ఇచ్చే అభ్యర్థి కోసం కాంగ్రెస్ కసరత్తు చేస్తోంది. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి అవకాశం ఇస్తే పరకాల నుంచి పోటీ చేస్తానంటున్నారు. 2014లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసిన ఇనుగాల వెంకట్రామిరెడ్డి మళ్లీ పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్తగా ఉన్నారు.

వర్ధన్నపేట

సిట్టింగ్ ఎమ్మెల్యే అరూరి రమేష్ రెండుసార్లు గెలిచారు. అంగ బలం, ఆర్థిక బలముంది. ఆయన్ను దీటుగా ఎదుర్కొనే అభ్యర్థిని ఖరారు చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది.

నర్సంపేట సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి మళ్లీ భారాస తరఫున బరిలోకి దిగనుండగా, ఇక్కడ దీటైన అభ్యర్థిని పోటీ పెట్టాలని కాంగ్రెస్ నిర్ణయించింది. మాజీ ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది. మాధవరెడ్డి వరంగల్ ఉమ్మడి జిల్లా డీసీసీబీ ఛైర్మన్‌గా పని చేశారు. 1999లో కాంగ్రెస్ నుంచి పోటీ చేసి ఓటమి చెందారు. 2004లో తిరిగి బరిలోకి దిగేందుకు సిద్ధమవ్వగా పొత్తులో భాగంగా భారాసకు కేటాయించారు. 2014లో కాంగ్రెస్ నుంచి డాక్టర్ కత్తి వెంకటస్వామి గౌడ్ పోటీ చేయగా, స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన దొంతి మాధవరెడ్డి గెలుపొందారు. భారాసలో చేరాలని ఆయనపై ఒత్తిళ్లు వచ్చినా కాంగ్రెస్‌లో కొనసాగారు. 2018లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చెందారు. కాంగ్రెస్ నుంచి పోటీ లేకపోవడంతో తొలి జాబితాలోనే దొంతి పేరు ఖరారు చేసే అవకాశాలున్నాయి.

# టికెట్‌పై ఆశలు!




జయశంకర్ : ఎన్నికల దిశగా అధికార భారాస రేసు గుర్రాలను ప్రకటించి ఒకింత ముందడుగు వేసింది. కొన్నాళ్లుగా నెలకొన్న ఉత్కంఠకు తెర దించుతూ దాదాపుగా సిట్టింగ్‌లకే అవకాశం కల్పించింది. జిల్లా పరిధిలోని భూపాలపల్లి, మంథని నియోజకవర్గాల్లో భారాస అభ్యర్థులుగా గండ్ర వెంకటరమణారెడ్డి, పుట్ట మధులను ప్రకటించడంతో వారి అనుచరగణం, పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తూ సంబరాలు చేసుకున్నారు. అభ్యర్థులు ఓటర్లను ప్రసన్నం చేసుకోవడమే ఇకక తరువాయి.. ఇక ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, భాజపా అభ్యర్థులు ఎవరెవరా..? అని జిల్లాలో ఆసక్తి నెలకొంది.

భూపాలపల్లిలో..కాంగ్రెస్..

భూపాలపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసేందుకు కాంగ్రెస్ నేత గండ్ర సత్యనారాయణరావు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తుందనే నమ్మకంతో కొంతకాలంగా నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. పార్టీ నుంచి కూడా మద్దతు ఉంది. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సన్నిహితుడు కూడా.. ఇదివరకు తెదేపాలో ఉన్న సమయంలో వీరిద్దరూ కలిసి పనిచేశారు. ప్రస్తుతానికైతే కాంగ్రెస్ నుంచి మరో అభ్యర్థి తెరపైకి రాలేదు. దీంతో ఆయనకే టికెట్ దక్కుతుందని అభిమానులు పేర్కొంటున్నారు. గండ్ర సత్యనారాయణరావు భూపాలపల్లి నియోజకవర్గం నుంచి రెండుసార్లు పోటీచేసి ఓటమి పాలయ్యారు. 2014 తెదేపా, భాజపా పొత్తులో భాగంగా భాజపాకు కేటాయించగా తెదేపాలో ఉన్న ఆయన భాజపాలో చేరి పోటీచేసి ఓడిపోయారు. ఎన్నికల తర్వాత భారాసలో చేరి టికెట్ ఆశించినా దక్కకపోవడంతో 2018లో ఏఐఎఫ్‌బీ పార్టీ నుంచి పోటీచేసి 50 వేల పైచిలుకు ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. అప్పుడు కాంగ్రెస్ నుంచి గెలిచిన గండ్ర వెంకటరమణారెడ్డి భారాసలోకి వెళ్లడంతో అభిమానుల కోరిక మేరకు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. మరోసారి అదృష్టం పరీక్షించుకోనున్నారు. టీపీసీసీ అధ్యక్షుడు చేపట్టిన భరోసా యాత్ర నియోజకవర్గంలో నిర్వహించారు.

భాజపా..్భూపాలపల్లి నియోజకవర్గంలో భాజపా పాగా వేసేందుకు ఎదురుచూస్తోంది. భాజపా నుంచి గత ఎన్నికల సమయంలో ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి పోటీ చేశారు. 15 వేల ఓట్లు సాధించారు. అప్పటి నుంచి నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాల్లో పాలు పంచుకుంటున్నారు. ఈ సారి పార్టీ టికెట్ ఆశిస్తున్నారు. కొంతకాలంగా నియోజకవర్గ వ్యాప్తంగా పర్యటిస్తున్నారు. అలాగే మరో ఇద్దరు సీనియర్ నేతలు టికెట్ ఆశిస్తున్నారు. భాజపా నేత బండి సంజయ్, కేంద్ర నాయకత్వం కూడా నియోజకవర్గంలో సమావేశాలు నిర్వహించి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. సర్వేలు సైతం నిర్వహిస్తున్నారు.

మంథని..కాంగ్రెస్..మంథని నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు బరిలో దిగే అవకాశం ఉంది. పార్టీలో కీలకవ్యక్తి కావడంతో దాదాపు ఆయనకు పార్టీలో పోటీ లేనట్లే కనిపిస్తోంది. మంథని నియోజకవర్గం నుంచి 1999, 2004, 2009, 2018లో నాలుగుసార్లు గెలిచారు. 2014 మాత్రం ఓటమి చెందారు. బలమైన నేత కావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం మరోసారి ఆయనకే టికెట్ కేటాయించనుంది. పార్టీ శ్రేణులు కూడా మరోసారి గెలిపించేందుకు సిద్ధమవుతున్నారు.

భాజపా..మంథని నియోజకవర్గం నుంచి భాజపా నేత చంద్రుపట్ల సునీల్‌రెడ్డి టికెట్ ఆశిస్తున్నారు. ఆయన తండ్రి రాంరెడ్డి తెదేపా హయాంలో మంథని నియోజవర్గం నుంచి ప్రాతినిధ్యం వహించారు. సునీల్‌రెడ్డి భారాసలో చేరి రాజకీయ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. తెలంగాణ ఉద్యమ సమయం నుంచి ఆయన పార్టీలో క్రియాశీలకంగా ఉన్నారు. 2014, 2018లో సునీల్‌రెడ్డి భారాస నుంచి టికెట్ ఆశించగా.. దక్కకపోవడంతో భాజపాలో చేరారు. ప్రస్తుతం ఆయన భాజపా నుంచి టికెట్ ఆశిస్తున్నారు. అయితే ఆయా పార్టీలు ప్రత్యేకంగా సర్వే చేయిస్తున్నాయి. పార్టీ అధిష్ఠానాలు ఎవరిని ఎంచుకుంటాయో వేచి చూడాల్సిన అవసరం ఉంది. కాంగ్రెస్, భాజపాతో పాటు తెదేపా, వైఎస్సార్‌టీపీ, జనసేన, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, డీఎస్పీ, తీన్మార్ మల్లన్న టీం, తదితర పార్టీలు కూడా వారివారి ఉనికిని ఈ ఎన్నికల్లో చాటుకునేందుకు సిద్ధమవుతున్నాయి.

# గిరిజన జిల్లా.. చదువుల ఖిల్లా




మహబూబాబాద్: ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాలలో చదవాలనుకునే జిల్లా విద్యార్థులు వరంగల్ నగరానికి.. హార్టికల్చర్ డిగ్రీ విద్య కోసం రాష్ట్ర రాజధానికి వెళ్లేవారు.. జిల్లా కేంద్రంలో సౌకర్యాలు లేక ప్రతిభ ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత లేక కోరుకున్న విద్యకు దూరమయ్యేవారు.. ప్రస్తుతం ఈ ప్రాంతవాసులకు ఆ వ్యయభారం నుంచి ఉపశమనం కలగనుంది. మధ్య తరగతి కుటుంబాలకు ఉపశమనం కలిగించేలా..వారు కోరుకుంటున్న విద్యాలయాలు మహబూబాబాద్‌లో ఏర్పాటు కాబోతున్నాయి. ఈ విద్యాసంవత్సరం నుంచే తరగతుల నిర్వహణ కొనసాగించేందుకు చురుకుగా ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలో ఇప్పటికే వైద్య, నర్సింగ్ కళాశాలను నెలకొల్పి తరగతుల నిర్వహణను కొనసాగిస్తున్నారు. ఉన్నత విద్యాలయాలు కొలువుదీరుతుండడంతో గిరిజన జిల్లా చదువుల ఖిల్లాగా రూపుదిద్దుకుంటుండడంతో జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. గిరిజన ప్రాంతమైన మహబూబాబాద్ ప్రజలకు అవసరమైన ఉన్నత విద్య, వైద్యాన్ని అందుబాటులోకి తీసుకొచ్చేలా సౌకర్యాలు కల్పిస్తున్నారు. వైద్యాభివృద్ధి కోసం గతేడాది వైద్య, నర్సింగ్ కళాశాలలను ప్రారంభించారు. 150 మంది వైద్యవిద్యార్థులు, 60 మంది నర్సింగ్ విద్యార్థులు చదువుతున్నారు. వీరి కోసం 100 పడకలుగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని 330 పడకలకు పెంచి బోధనాసుపత్రిగా తీర్చిదిద్దారు. త్వరలోనే రెండో బ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ ఏడాది జనవరిలో సీఎం కేసీఆర్ సమీకృత కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభించిన అనంతరం ప్రసంగిస్తూ జిల్లాలో జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు 2023–24 విద్యాసంవత్సరం నుంచే తరగతులను నిర్వహిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం కళాశాల ఏర్పాటుకు అనుమతి ఇచ్చారు. జేఎన్‌టీయూ సీఎస్ఈ, సీఎస్ఈ(డేటాసైన్స్), ఈసీఈ, ఈఈఈ మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులను ప్రవేశపెట్టింది. కోర్సుకు 60 సీట్ల చొప్పున ఐదు కోర్సులకు 300 సీట్లను కేటాయించింది.

మల్యాల ఉద్యాన పరిశోధన కేంద్రంలో ఉద్యాన డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తూ అనుమతులు ఇవ్వడంతో పాటు ఈ ఏడాది నుంచే 60 మంది విద్యార్థులతో మొదటి బ్యాచ్‌ను కొనసాగించేలా ఉత్తర్వులను జారీ చేశారు. కేజీ టూ పీజీ గిరిజన బాలికల గురుకుల పాఠశాలను కూడాప్రారంభించారు.

గిరిజన గురుకుల పాఠశాలకు శాశ్వత భవనాల నిర్మాణం కోసం రూ. 12 కోటలతో శంకుస్థాపన చేసేందుకు సన్నద్ధమవుతున్నారు. త్వరలోనే ఎంబీఏ విద్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు.

తాత్కాలిక భవనాల్లోనే

ఇంజినీరింగ్, ఉద్యాన డిగ్రీ కళాశాల తరగతులను ప్రస్తుతం తాత్కాలిక భవనాల్లోనే నిర్వహించనున్నారు. భవనాలను గుర్తించే పనిలో ఉన్నారు. శాశ్వత భవనాల నిర్మాణానికి స్థలాలను గుర్తించారు. తాత్కాలిక భవనాల్లో తరగతులు కొనసాగిస్తూనే శాశ్వత భవనాల నిర్మించనున్నారు. వీటి ఏర్పాటుతో జిల్లాలో కొంత మందికి బోధనేతర సిబ్బంది నియామకం చేపడితే ఉద్యోగాలు వచ్చే అవకాశాలున్నాయి. కొందరికి పరోక్షంగా ఉపాధి అవకాశం దక్కనుంది. ప్రైవేటు వసతి గృహాలు కూడా వెలువనున్నాయి. దీంతో పాటు వివిధ వ్యాపార సముదాయాలు పెరిగి జిల్లా ఆర్థికాభివృద్ధికి తోడ్పాటు కానుందని జిల్లా ప్రజలు భావిస్తున్నారు.

ఉన్నత విద్యాలయాల ఏర్పాటు హర్షణీయం

డాక్టర్ డోలి సత్యనారాయణ, తెలంగాణ ఉద్యమకారుడు, మానుకోట ఎన్నో ఆశయాలతో ఏర్పడిన జిల్లాలో విద్యా, వైద్యాభివృద్ధికి సర్కారు తీసుకున్న నిర్ణయం హర్షణీయం. జిల్లాను విద్యాకేంద్రంగా తీర్చిదిద్దేందుకు ఇప్పటికే వైద్య, నర్సింగ్ కళాశాలలను నెలకొల్పింది. ఇప్పుడు ఇంజినీరింగ్, ఉద్యాన డిగ్రీ కళాశాలను అందుబాటులోకి తీసుకురావడం సంతోషకరం. ప్రభుత్వ పీజీ కళాశాలను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. పేద విద్యార్థులకు మేలుబి. రమేష్, టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు, మహబూబాబాద్‌జిల్లాలోని పేద విద్యార్థులు ఇంజినీరింగ్, నర్సింగ్, వైద్య, ఉద్యాన విద్యనభ్యసించడానికి సుదూర ప్రాంతాలకు వెళ్లి చదువుకునేవారు. కళాశాలలు అందుబాటులోకి రావడంతో పేదలకు ఉన్నత విద్య మరింత చేరువైంది. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి ఉపాధ్యాయ సంఘాలు గర్వపడుతున్నాయి.

# అవుటర్‌పై.. తరచూ అంధకారం

హైదరాబాద్: జోరువాన, గాలులే కాకుండా ఇతర సాంకేతిక కారణాలతో తరచూ అవుటర్‌రింగ్‌రోడ్డుపై రాత్రివేళ చీకట్లు కమ్ముకుంటున్నాయి. నగరం చుట్టూ 150 కి.మీ. మేర ఓఆర్ఆర్ విస్తరించి ఉంది. 2016 తర్వాత ఇది అందుబాటులోకి వచ్చినా ఇంటర్ ఛేంజ్‌లోని టోల్‌బూత్‌ల వద్ద మినహా ఎక్కడా సెంట్రల్ లైటింగ్ లేదు. ఈ క్రమంలో తరచూ ప్రమాదాలు జరిగేవి. వాహన రద్దీతో పాటు అవుటర్ చుట్టూ నివాస ప్రాంతాలు ఏర్పాటుకావడంతో తొలుత గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వరకు 22 కి.మీ.మేర సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుచేశారు. ప్రయాణికుల వినతులతో 2021లో మిగతా 132 కి.మీ. మేర 13,303 ఎల్ఈడీ లైట్లు ఏర్పాటుచేశారు. దీంతో రాత్రివేళల్లో అవుటర్‌పై ప్రయాణం సులువుగా మారింది. కొన్ని సాంకేతిక కారణాలు, నిర్వహణ లోపంతో తరచూ రాత్రి వేళ లైట్లు వెలగడం లేదని, 120 కి.మీ వేగంతో వెళ్తున్నప్పుడుఅవుటర్‌పై అంధ కారం ఆందోళన కలిగిస్తోందని వాహనదారులు చెబుతున్నారు. నిర్వహణ తీరు మారేనా? అవుటర్ లైటింగ్, రోడ్ల మరమ్మతులు, పచ్చదనం అభివృద్ధి తదితర పనులకు ఏటా హెచ్ఎండీఏ రూ. 150 కోట్ల వరకు వెచ్చించేది. ఇటీవల ఓఆర్ఆర్‌ను అద్దె ప్రాతిపదికన 30 ఏళ్లు ఓ ప్రైవేటు సంస్థకు లీజుకు ఇచ్చిన సంగతి తెలిసిందే. పచ్చదనం మినహా ఇతర నిర్వహణంతా సదరు సంస్థ చేతిలోకి వచ్చింది. ఎప్పటికప్పుడు మౌలిక వసతులను మెరుగుపరిస్తేనే ఎక్కువ వాహనాలు రాకపోకలకు అవకాశముంటుంది.

# బాలల భవితకు భరోసా

ఖమ్మం : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉపాధ్యాయుల ప్రోత్సాహంతో చదువులో ప్రైవేటుకు దీటుగా రాణిస్తున్నారు. ఉపాధ్యాయుల కృషి, పక్కా ప్రణాళికతో నిరుపేద పిల్లలు ఏటా గురుకుల పాఠశాలల్లో అయిదోతరగతి ప్రవేశాలు పొందుతుండటం విశేషం. ఈ విషయంలో ఉత్తమ ఫలితాలు కనబర్చుతూ ముదిగొండ మండలంలోని పమ్మి ప్రాథమిక పాఠశాల ఆదర్శంగా నిలుస్తోంది.

పమ్మి పాఠశాలలో ప్రత్యేక శిక్షణ..ప్రాథమిక పాఠశాలలో ఈ ఏడాది 94 మంది చదువుతున్నారు. కొన్నేళ్లుగా ఇక్కడి విద్యార్థులు ఏటా గురుకులాలకు ఎంపికవుతున్నారు. ప్రధానోపాధ్యాయుడు రమేశ్, ఉపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, బ్రహ్మంసాహెబ్, నరసింహారావులు విద్యా సంవత్సరం ప్రారంభం నుంచి ప్రత్యేక ప్రణాళిక ప్రకారం విద్యార్థులను సన్నద్ధం చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు బోధిస్తున్నారు. మూడు తరగతి గదుల్లో ఆండ్రాయిడ్ టీవీలతో డిజిటల్ బోధన చేపడుతున్నారు. ముఖ్యంగా గురుకుల ప్రవేశాల కోసం తామే నమూనా ప్రశ్నలు తయారుచేసి.. తొలుత ఇక్కడే పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రత్యేక సన్నద్ధతతో గతేడాది నాలుగో తరగతి విద్యార్థులు 23 మంది అయిదో తరగతిలో గురుకుల ప్రవేశాలకు సన్నద్ధమై.. 12 మంది విజయం సాధించారు. ఈ ఏడాదీ ఆసక్తి ఉన్నవారిని గుర్తించి ప్రత్యేకంగా తీర్చిదిద్దుతుండటం ఇతర పాఠశాలల వారికి ఆదర్శంగా నిలుస్తోంది. ఈ ప్రయత్నం ఉభయ జిల్లాల్లోని హెచ్.ఎం.లు, ఉపాధ్యాయులు అందిపుచ్చుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు.

# పంట నష్టాన్ని పట్టించుకోలే..

జగిత్యాల : గతనెల మూడు, నాలుగు వారాల్లో కురిసిన భారీ వర్షాలతో వరదలు ముంచెత్తి రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున పంటలు దెబ్బతిన్న క్రమంలో జిల్లాలోనూ పైర్లకు తీవ్రనష్టం వాటిల్లింది. దెబ్బతిన్న పైర్ల ప్రాథమిక వివరాలను తెప్పించుకున్న రాష్ట్రప్రభుత్వం పరిహారం ఇచ్చి రైతులను ఆదుకుంటామని ప్రకటించినా తదుపరి విస్మరించింది. రైతువారీగా క్షేత్రసర్వేకు ప్రభుత్వం ఇప్పటివరకూ ఆదేశాలు వెలువరించలేదు. జిల్లాల వ్యవసాయాధికారుల నుంచి వచ్చిన ప్రాథమిక అంచనాను బట్టి ఆయా గ్రామాల్లో ఇప్పటివరకు క్షేత్రసర్వే చేపట్టకపోవటంతో నష్టపోయిన రైతులకు ఇక పరిహారం అందే అవకాశమే లేకుండాపోయింది.

జిల్లాలో గతనెలలో భారీ వర్షానికి 180 గ్రామాలకు చెందిన 14,065 మంది రైతులకు చెందిన 15,487 ఎకరాల్లో అన్నిరకాల పంటలకు తీవ్రంగా నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. ఇందులో వరి 12,446 ఎకరాలు, పత్తి 279, కంది 64, సోయాబీన్ 58, మక్క 2,373, పసుపు 267 ఎకరాల్లో దెబ్బతిన్నట్లు గుర్తించారు. భారీ వర్షంతో లోతట్టు, ఎగువ ప్రాంతం, పొలాలు, తోటలనే తేడా లేకుండా అంతటా వరదనీరు ముంచెత్తి పైర్లను తీవ్రంగా నష్టపర్చింది. వేలాది ఎకరాల్లో నాట్లువేసిన వరిపైరు, మొలకెత్తిన ఆరుతడి పంటల మొక్కలు ఆనవాళ్లే లేకుండా కొట్టుకుపోయాయి. పొలాల్లో గండ్లుపడి గట్లుకూడా నామరూపాల్లేకుండా కొట్టుకుపోగా మడుల్లో ఇసుకమేటలు,



బండలు పేరుకు పోయాయి. రైతులు ఎకరాకు కనీసం రూ. 17 వేల నుంచి రూ. 36 వేల వరకు పెట్టుబడిని కోల్పోగా మరమ్మతులకు ఎకరాకు రూ. 20 వేల చొప్పున వెచ్చించారు. పంటలను విత్తుకునే అదను దాటడం, లెవెలింగ్ ట్రాక్టర్లతో మరమ్మతులు చేపట్టే వీలులేక చాలాచోట్ల దెబ్బతిన్న పొలాలను బీళ్లుగానే వదిలేశారు. పైర్లు నీటమునిగి కొట్టుకుపోవటం, పొలాల్లో ఇసుకమేటలు, మరమ్మతులు, పొలాలను బీళ్లుగానే వదలటం, వర్షానికి చీడపీడల తీవ్రత పెరిగి సస్యరక్షణ, కలుపు మందులు చల్లలేక గడ్డిపెరిగి తోటలకు నష్టం వాటిల్లటం తదితరాలను లెక్కిస్తే జిల్లాలోని రైతులు రూ. 100 కోట్ల వరకు నష్టపోయారు. గడచిన సంవత్సరాల్లో పంటలకు వాటిల్లిన నష్టానికి ఇటు రాష్ట్ర ప్రభుత్వ పరిహారం, అటు పంటల బీమా పరిహారం రాకపోగా 2023 వేసవిలోని రాళ్లవానల నష్టానికి రాష్ట్ర ప్రభుత్వం ఎకరాకు రూ. 10 వేల చొప్పున ప్రకటించింది. మార్చిలోని నష్టానికి నిధులు రాగా ఏప్రిల్‌లోని నష్టానికి చెంది రైతులకు చెక్కులను ఇస్తామని ప్రభుత్వం పేర్కొంటోంది. ఈ నేపథ్యంలో గత నెలలోని నష్టాన్ని కూడా క్షేత్రం వారీగా లెక్కించి నష్టపోయిన మేరకు తమకు పంట నష్ట పరిహారాన్ని ఇవ్వాలని కర్షకులు కోరుతున్నారు. దీనిపై డీఏవో సురేశ్‌కుమార్ వివరిస్తూ తమకు తుది సర్వేకు ఆదేశాలు రాలేదన్నారు.

# ముంపు ముప్పు.. నివారణకు అప్రమత్తం


కరీంనగర్ : కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలో ముంపు నివారణకు సిబ్బంది అప్రమత్తంగా ఉంటున్నారు. గత నెలలో వారం రోజులు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు రహదారులు, వీధులు జలమయమయ్యాయి. నగర పాలిక రెస్క్యూ బృందాలు క్షేత్రస్థాయిలో అత్యవసర సేవలు అందిస్తూ శభాష్ అనిపించుకుంటున్నాయి. కార్యాలయంలో నిరంతరం కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. ఏ రాత్రి ఫోన్ చేసినా అత్యవసర సేవల్లో ఉండే నోడల్ అధికారి స్పందిస్తారు. 15 నిమిషాల్లో సిబ్బంది చేరుకొని అవసరమైన సహాయక చర్యలు చేపడుతున్నారు. గత నెలలో వారం రోజుల్లో సుమారు 180 కాల్స్ వచ్చాయి. ఎప్పటికప్పుడూ టెలి కాన్ఫరెన్స్ ఏర్పాటు చేసి సమీక్షిస్తున్నారు.

వెంటనే రంగంలోకి..

వర్షం పడితే చాలు అత్యవసర బృందాలు రంగంలోకి దిగుతున్నాయి. కాలనీల్లో వరద చేరినా, రహదారులపై నీరు నిలిచి రాకపోకలకు ఆటంకాలు కలిగినా, చెత్త చెదారంతో నాలాలు మూసుకుపోయినా వెంటనే చేరుకొని తాత్కాలిక చర్యలు తీసుకుంటున్నారు. ఖాళీ స్థలాల్లో నీరు నిలిచి సమస్యగా ఉంటే మోటారు పంపులు పెట్టి తోడిస్తున్నారు. జేసీబీలతో కచ్చా కాల్వలు తీయిస్తున్నారు. రోడ్లపై, ఇళ్లలో చెట్లు పడిపోతే వచ్చి వెంటనే పక్కకు జరిపించడం వంటి పనులు చేపడుతున్నారు. రాత్రిపూట శిథిల భవనాలు, గోడలు పడిపోతే.. అక్కడికి వెళ్లి అందులో ఉన్న వారిని పునరావస కేంద్రాలకు, బంధువుల ఇళ్లకు తరలించడం, దానిని పూర్తిగా కూల్చివేయడం వంటి పనులు చేపట్టారు.

జలమయమైన చోట మకాం

నగరంలో గత నెల చివరి వారంలో ఏకధాటిగా కురిసిన వర్షాలకు



ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరదతో పలు రహదారులు చెరువులను తలపించాయి. కలెక్టరేట్ రోడ్డు, ఎన్టీఆర్ చౌరస్తా, కోతిరాంపూర్, రాంనగర్, మంచిర్యాల చౌరస్తా, రామగుండం బైపాసు రోడ్డులోని హౌసింగ్‌బోర్డుకాలనీ, ఆర్టీసీ వర్క్‌షాప్ ఎదురుగా, ఇతర వీధుల్లో వరద చేరుకోవడంతో అక్కడికి డీఆర్ఎఫ్‌తోపాటు ఇంజినీరింగ్, శానిటేషన్, పట్టణ ప్రణాళిక అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకున్నారు. వరదను అప్పటికప్పుడే మళ్లించడంతో నగరంలో ఎక్కువ సేపు నీరు నిల్వకుండా జాగ్రత్త పడ్డారు. ఎక్కువ నీరు వచ్చిన చోట ఆయా అధికారులు అక్కడే మకాం వేసి పరిస్థితి చక్కబెడుతున్నారు.

నిరంతరం అందుబాటులో..

ప్రస్తుతం ఇళ్ల మధ్య, శివారు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో నిలిచిన వరదను పంపించేందుకు కాల్వలు తీయిస్తున్నారు. అత్యవసర బృందాల నోడల్ అధికారులు, ఆయా డివిజన్ల ఇంజినీరింగ్ అధికారులు సిబ్బందితో పనులు ప్రారంభించారు. బల్దియాకు చెందిన రెండు జేసీబీలతో అద్దెకు మరో రెండు జేసీబీలు తీసుకున్నారు. నీటిని తోడేందుకు మూడు డీజిల్ పంపులను ఉపయోగిస్తున్నారు. వీధుల్లో పూడిక, చెత్తా చెదారం రోడ్లపై ఉండగా పారిశుద్ధ్య కార్మికులతో తొలగిస్తున్నారు. మొత్తానికి అత్యవసర సేవలతో నగరంలో వర్ష ప్రభావం తగ్గించేలా పనులు చేస్తుండటం గమనార్హం.

# చినుకు లేక.. కునుకు రాక..!

కొత్తగూడెం : ప్రకృతిపై భారం వేసి వర్షాధార పంటలు సాగుచేసిన అన్నదాతలకు నిరాశే ఎదురవుతోంది. వర్షాభావ పరిస్థితులు పంటలను దెబ్బతీస్తున్నాయి. జూన్‌లో అడపాదడపా, జులైలో భారీగా కురిసిన వర్షాలకు మొక్కజొన్న, పత్తి, పెసర, కంది తదితర పంటలు అధిక మొత్తంలో సాగయ్యాయి. ప్రస్తుతం పూత, కాత దశలో ఉన్నాయి. కొన్నిరోజులుగా వానలు ముఖం చాటేయడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడులపై ప్రభావం

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈసారి వర్షాభావ పరిస్థితులు నెలకొనటంతో పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అత్యధికంగా సాగుచేసిన పత్తి పంటపై వర్షాభావ ప్రభావం ఎక్కువగా ఉండనుంది. కాయ దశలో ఉండాల్సిన పత్తి చేన్లు వర్షాలు లేక పూత దశకు సైతం రాలేదని రైతులు చెబుతున్నారు.

మొక్కజొన్న, కంది, పెసర తదితర పంటల పరిస్థితీ అలాగే ఉంది. మరో వారం పాటు వర్షాలు కురవకపోతే ఆశలు వదులుకోవాల్సిందేనని అన్నదాతలు వాపోతున్నారు.



మాకున్న మూడెకరాల్లో పత్తి పంట సాగుచేశాం. ఇది పూర్తిగా వర్షాధారిత భూమి. వర్షాలు కురవకపోవడంతో ఆశించిన స్థాయిలో పైరు ఎదగలేదు. కలుపు సమస్య తీవ్రమైంది. చిన్నపాటి వర్షం సైతం పడకపోవడంతో మొక్కలకు అడుగు మందు అందక ఎదుగుదల లోపించింది. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే అధిక మొత్తంలో నష్టపోయే అవకాశముంది.

బానోత్ సునీత, రైతు, టేకులపల్లి

మొక్కలు సున్నిత దశ (పత్తి పంట మొగ్గదశలో, మొక్కజొన్న కంకి దశలో) ఉన్నప్పుడు వాటికి నీరు తప్పనిసరిగా అందించాలి. ఆసమయంలో వర్షాభావ పరిస్థితులు తలెత్తితే దిగుబడి తగ్గిపోతుంది. తాత్కాలికంగా నీటి ఎద్దడిని తట్టుకోవటానికి 20 గ్రాముల యూరియాను ఒక లీటరు నీటిలో కలిపి పంటపై పిచికారి చేయాలి. అది కాకుండా 10 గ్రాముల డీఏపీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారి చేస్తే ఎర్ర నేలలైతే పది రోజులు, నల్లరేగడి నేలలైతే నెల రోజుల పాటు నీటిఎద్దడిని తట్టుకుంటాయి. వి.లక్ష్మీనారాయణమ్మ, కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కోఆర్డినేటర్, కొత్తగూడెం

# భద్రకాళి రోడ్డులో పొంచి ఉన్న ప్రమాదం

వరంగల్ : ప్రాంతం రంగంపేట కూడలి శ్రీభద్రకాళి దేవాలయానికెళ్లే రహదారి మార్గంలో కల్వర్టుకు పగుళ్లు వచ్చాయి. ఇటీవల భద్రకాళి నాలా ద్వారా వరద నీరు పోటెత్తడంతో కల్వర్టు దెబ్బతింది. రంగంపేట సెంటర్ నుంచి అయ్యప్పస్వామి గుడి వరకు ప్రధాన రహదారిలో ప్రమాదం పొంచి ఉంది. వరదలతో పదేళ్ల క్రితం నిర్మించిన కల్వర్టుకు పగుళ్లు రాగా, 30 ఏళ్ల క్రితం నాటి పాత కల్వర్టు చెక్కు చెదరలేదు. వరంగల్ ఎంజీఎం రోడ్డు నుంచి రోజూ వేలాది మంది భక్తులు నాలుగు చక్రాలు, ద్విచక్ర వాహనాలతో భద్రకాళి ఆలయానికెళ్తారు. కల్వర్టు దెబ్బతినడంతో వాహనదారులు, స్థానికులు భయపడుతున్నారు. రెండు కల్వర్టుల వద్ద రెయిలింగ్ ఎగిరి పోయింది. వాహనాలు అదుపు తప్పితే నాలాలో పడిపోతాయంటున్నారు.

మొదలుకాని శాశ్వత పరిష్కార పనులు

2022 జూన్‌లో రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ రంగంపేట-భద్రకాళి దేవాలయం రోడ్డులో కల్వర్టు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. స్మార్ట్ సిటీ పథకం ద్వారా సుమారు రూ.2.72 కోట్లతో వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో కల్వర్టుల విస్తరణ, అభివృద్ధి పనులు ప్రతిపాదించారు. ఏటా భారీ వర్షాలు కురిసినప్పుడు రంగంపేట కూడలి నీట మునుగుతుంది. భద్రకాళి దేవాలయానికి రాకపో క్‌లు బంద్ అవుతున్నాయి. ఇటీవల వచ్చిన వరదలతో నాలుగు రోజుల పాటు భక్తులను అనుమతించ లేదు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రంగంపేట-భద్రకాళి రోడ్డులో కల్వర్టు విస్తరణ, ఎత్తు పెంచితే వాహనాల రాకపోకలకు ఇబ్బందులుండవని నిపుణులు సూచించారు. గ్రేటర్ వరంగల్ ఇంజినీర్ల అశ్రద్ధతో శాశ్వత పరిష్కార పనులు మొదలు కాలేదని తెలిసింది.

# కాలనీల్లో చీకట్లు

హైదరాబాద్ : రాజధాని రహదారులు చీకట్లో కూరుకుపోతున్నాయి. ప్రధాన రహదారులేగాక కాలనీ రోడ్లలోనూ అంధకారం నెలకొంది. వీధి లైట్లు వెలగకపోవడంతో స్థానికులకు సమస్యలు తప్పడం లేదు. మ్యాన్‌హోళ్లు.. వీధి కుక్కలతో ఎక్కడ ప్రమాదాల బారిన పడతామోనని ఆందోళన చెందుతున్నారు. ఇవీ కారణాలు..బల్దియాకు, ఈఈఎస్ఎల్‌కు జరిగిన ఒప్పందం ప్రకారం.. రోజూ 98 శాతం వీధి లైట్లు వెలగాలి. వెలగకపోతే బిల్లులు చెల్లించమని అప్పటి కమిషనర్ డాక్టర్.బి.జనార్ధన్‌రెడ్డి నిబంధన పెట్టారు. అయితే వీధి లైట్లు పనిచేస్తున్నాయా? లేదా అని చూడాల్సిన ఇంజినీర్లు ఆ విషయాన్ని పట్టించుకోవట్లేదు. వెలగని వాటికి సైతం బిల్లులు చెల్లిస్తున్నారు. ఈఈఎస్ఎల్ సంస్థ బల్దియాతో చేసుకున్న ఒప్పందాన్ని సైతం ఉల్లంఘిస్తోంది. మరమ్మతులకు గురైన వాటి స్థానంలో నూతన లైట్లు ఏర్పాటు చేసేందుకు వీలుగా గోదాములో అందుబాటులో ఉంచడం లేదు. ఎప్పుడు అడిగినా స్టాక్ లేదనే సమాధానమిస్తోంది. పదే పదే అదే సమాధానం చెబుతుండటంతో.. ఒప్పందాన్ని రద్దు చేసుకుంటామని గత కమిషనర్ డి.ఎస్.లోకేష్‌కుమార్ సైతం హెచ్చరించారు. అయినా తీరు మారలేదు.

20 శాతానికిపైగా..నగరంలో ఐదు లక్షలకుపైగా వీధి లైట్లు ఉండగా, అందులో 20 శాతానికిపైగా పని చేయట్లేదు. మొత్తం 28 వేల సీసీఎంఎస్ బాక్సులు ఉండగా, పని చేస్తున్నవి 10 వేలు మాత్రమే. దీంతో వీధి లైట్లు సమయానికి వెలగడం, ఉదయాన్నే ఆరిపోక సమస్యలు తప్పడం లేదు.

# పల్లెలకు జ్వరమొచ్చింది



ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని అనేక పల్లెలపై టైఫాయిడ్ పంజా విసురుతోంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా టైఫాయిడ్ కేసులు పెరుగుతుండటంతో వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. స్థానిక సంస్థల అధికారులను అప్రమత్తం చేసింది. ఈ ఏడాది జనవరి నుంచి ఈనెల 20 వరకు 6,162 కేసులు నమోదైనట్లు వైద్యశాఖాధికారుల నివేదికల్లో తేలింది. భద్రాద్రి జిల్లాలో అత్యధిక కేసులు నమోదయ్యాయి. పురపాలికల్లో తాగునీటి పైపులైన్ల లీకేజీతో పాటు పంచాయతీల్లో శుద్ధజలం అందకపోవటంతో చాపకింద నీరులా వ్యాధి సోకుతోంది.డీసీహెచ్ఎస్ పరిధిలో 5,794, డీఎంహెచ్ఎస్ పరిధిలో 259 కేసులు, ఖమ్మం జిల్లాలో 109 కేసులు నమోదైనట్లు గణాంకాలు చెబుతున్నాయి. కలుషిత ఆహారం, పరిశుభ్రత కొరవడటం, తాగునీరే వ్యాధి కారకాలు అని వైద్యాధికారులు స్పష్టం చేస్తున్నారు.

వ్యాధి లక్షణాలు

టైఫాయిడ్ బ్యాక్టీరియా మనుగడ సాగించేది కేవలం మానవ శరీరంలోనే. కొంతమందిలో దీని లక్షణాలేమీ బయటకు కనిపించవు. టైఫాయిడ్ కారక బ్యాక్టీరియా పేగునాళాల ద్వారా వ్యాపించి పేగు గోడలలోకి చొచ్చుకొని పోయి రక్తంలో కలుస్తుంది. మలం, రక్తనమూనాల ద్వారా రోగ నిర్ధారణ చేయవచ్చు. వ్యాధి సోకినప్పుడు జ్వరం 104 డిగ్రీల వరకూ చేరుకుంటుంది. విపరీతమైన చమటలు, గ్యాస్ట్రో ఎంటిరైటిస్, విరేచనాలు రావొచ్చు. రెండు వారాల తర్వాత శరీరంపై ఒక్కోసారి దద్దుర్లు, గులాబీ రంగు మచ్చలు కనిపిస్తాయి. కడుపునొప్పి రావొచ్చు.

వ్యాధి సోకినవారు మగతగా కనిపిస్తారు. మూడోవంతు రోగులకు ఛాతికింద, పొట్ట మీద గులాబీ రంగు మచ్చలు కనిపిస్తాయి. అరుదైన సందర్భాల్లో సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే టైఫాయిడ్‌తో చనిపోయే ప్రమాదముంది.

మణుగూరు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి(ఏహెచ్)లో ఈ ఏడాది జనవరి నుంచి ఈనెల 20 వరకు ఏకంగా టైఫాయిడ్ కేసులు 2,323 నమోదయ్యాయి. జిల్లాలో అత్యధిక కేసులు ఈ ప్రాంతంలోనే వెలువడుతున్నాయి. ప్రధానంగా కలుషిత నీటితో టైఫాయిడ్ మహమ్మారి విజృంభిస్తోంది.

అశ్వారావుపేట సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)లో జనవరి నుంచి ఈనెల 20 వరకు టైఫాయిడ్ కేసులు 1,838 నమోదయ్యాయి. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ కేసులు వెలుగుచూస్తున్నాయి. గిరిజన ప్రాంతం కావటంతో పరిసరాల పరిశుభ్రత, శుద్ధజలంపై అవగాహన లేమితో రోగాల బారిన పడుతున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

తినేముందు రెండు చేతులను శుభ్రంగా కడుక్కోవాలి.

కలుషిత ఆహారం, నీటిని తీసుకోవద్దు.


పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలి. మురుగునీరు నిలవకుండా చూసుకోవాలి.

వీలైనంత వరకు తాజా ఆహారం, కాచి చల్లార్చిన నీటిని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చు.

పానీపూరి, శీతల పానీయాలు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలి.

టైఫాయిడ్ కేసులు విపరీతంగా నమోదవుతున్నాయి. కలుషిత ఆహారం, నీటి వల్లే వ్యాధి సోకుతుంది. తోపుడుబండ్లపై ఆహార పదార్థాలు, పానీపూరి తినటం వల్ల టైఫాయిడ్ రావొచ్చు. వేడిగా ఉన్న ఆహారం తీసుకోవాలి. కాచివడపోసిన నీటిని తాగాలి. వ్యాధి లక్షణాలుంటే తక్షణమే చికిత్స తీసుకోవాలి.రవిబాబు, డీసీహెచ్ఎస్, భద్రాద్రి

# మహిళల భద్రతే కర్తవ్యం




ఖమ్మం : రైలు ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా.. తమ వెంట తెచ్చుకున్న వస్తువులను మర్చిపోయినా.. ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తించినా.. రైలు పట్టాల సమీపంలో ఆత్మహత్యకు పాల్పడేందుకు ప్రయత్నించినా.. మహిళల భద్రతే ప్రథమ కర్తవ్యంగా మేమున్నామంటూ సేవలు అందిస్తున్నారు ఖమ్మం ప్రభుత్వ రైల్వే పోలీస్‌స్టేషన్(జీఆర్పీ) అధికారులు. స్టేషన్ ఆవరణలో ప్రత్యేకంగా మహిళా సహాయ కేంద్రం(ఉమెన్ హెల్ప్ డెస్క్)ను ఏర్పాటు చేసి వారికి ఎదురయ్యే సమస్యలను పరిష్కరించి సురక్షితంగా ఇళ్లకు పంపుతున్నారు. కౌన్సెల్సింగ్ ఇచ్చి ఠాణాల్లో మహిళలకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పిస్తున్నారు.

ప్రత్యేకంగా ఓ మహిళా కానిస్టేబుల్

ఖమ్మం కేంద్రంలో ప్రత్యేకంగా ఓ మహిళా కానిస్టేబుల్‌ను విధుల్లో ఉంచుతున్నారు. ఎవ్వరైనా ఫిర్యాదులు చేస్తే తక్షణమే స్పందించి రక్షణ కల్పిస్తున్నారు. జనరల్, రిజర్వేషన్ బోగిల్లో మహిళలకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకుంటున్నారు. రైలు బోగీల్లో ఈవ్‌టీజింగ్ జరిగినా, వస్తువులను మరిచిపోయినా స్పందించి తర్వాతి జీఆర్పీ స్టేషన్‌లో సిబ్బందిని అప్రమత్తం చేసి బాధిత మహిళలకు అందేలా చర్యలు చేపడుతున్నారు.

ఖమ్మం నగరంలోని రెండో పట్టణ ప్రాంతానికి చెందిన మహిళ అత్తింటి వేధింపులు తాళలేక ఏప్రిల్‌లో ఆత్మహత్య చేసుకునేందుకు రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాలపై తచ్చాడుతోంది. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మహిళను కాపాడారు. మహిళా కానిస్టేబుల్‌తో ఆమెకు కౌన్సెలింగ్ ఇప్పించడంతో ఆత్మహత్య ఆలోచన విరమించుకున్నారు.

మార్చిలో ఎర్రుపాలెం మండలం బనిగండ్లపాడుకు చెందిన మహిళ కృష్ణా ఎక్స్‌ప్రెస్‌లో సికింద్రాబాద్ వెళ్తోంది. బ్యాగులు సీటు కింద పెట్టారు. తోటి ప్రయాణికుడు ఒకరు తన బ్యాగ్ మర్చిపోయి ఖమ్మంలో దిగారు. విషయం మహబూబాబాద్‌లోని బంధువుకు చెప్పడంతో ఆయన రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. పొరపాటున మహిళ బ్యాగును తీసుకెళ్లాడు. మహిళ ఫిర్యాదు మేరకు బ్యాగును గుర్తించి ఆమెకు ఇచ్చారు. ఇందులో రూ.30 లక్షలుండటం గమనార్హం.

రైల్వే హెల్ప్‌లైన్ 139కి కాల్ చేయండి

రైలు ప్రయాణంలో మహిళలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తక్షణమే రైల్వే హెల్ప్ లైన్ నంబర్ 139కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలి. తక్షణమే మహిళా హెల్ప్ డెస్క్‌లోని మహిళా కానిస్టేబుల్ స్పందించి ప్రయాణికురాలికి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. మహిళల రక్షణకు తగిన చర్యలు తీసుకుంటున్నాం.పి.భాస్కర్‌రావు, ఎస్‌హెచ్‌ఓ, ఖమ్మం జీఆర్పీ స్టేషన్

# పట్టాలెక్కని పాండురంగాపురం రైల్వేమార్గం

ఖమ్మం : బూర్గంపాడు మండలంలోని పాండురంగాపురం రైల్వేస్టేషన్ నుంచి సారపాక వరకు సుమారు 12 కిలోమీటర్లు రైల్వేమార్గం విస్తరించాలన్నది దశాబ్దాల కల. రూ.200 కోట్ల వ్యయంతో ఈ మార్గాన్ని పొడిగించాలని వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు ప్రతిపాదించారు. క్షేత్రస్థాయి సర్వేలు సైతం పూర్తయ్యాయి. పనులు ప్రారంభిస్తారని అనుకుంటున్న తరుణంలో ఈ అంశం మరుగున పడింది. అప్పటి నుంచి ఎన్నికల సమయంలోనూ, పార్లమెంటు సమావేశాల్లోనూ ఈ విషయం చర్చకు వచ్చేది. ఈక్రమంలో 2021లో ఒడిశాలోని మల్కన్‌గిరి నుంచి పాండురంగాపురం వరకు సుమారు 173.41 కిలోమీటర్ల మేర నూతనంగా రైల్వే లైను నిర్మించాలని ప్రతిపాదించారు. దీనిపై రైల్వేశాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రత్యేక దృష్టిసారించి పలు దఫాలుగా ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహించారు. గతేడాది క్షేత్రస్థాయిలో సర్వేలు సైతం పూర్తి చేశారు. ఇక నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించడమే తరువాయి అని అంతా భావించారు. అయినా మళ్లీ నిరాశే మిగిలింది. ఇటీవల కేంద్ర మంత్రివర్గం తొమ్మిది రాష్ట్రాల్లో రైల్వేలైన్ల విస్తరణకు రూ.32,500 కోట్లు కేటాయించడానికి పచ్చజెండా ఊపింది. ఈ ప్రతిపాదనల్లో రూ.2,800 కోట్లతో విస్తరించాలని భావించిన మల్కన్‌గిరి-పాండురంగాపురం రైల్వే మార్గం లేకపోవడంతో మరోసారి ఎదురుచూపులు తప్పేలా లేవని స్థానికులు నిట్టూర్చుతున్నారు.




అధిక ప్రాధాన్యంపాండురంగాపురం నుంచి సారపాక వరకు రైల్వే మార్గానికి అధిక ప్రాధాన్యం ఉంది. ప్రస్తుతం కొత్తగూడెంలో రైల్వేస్టేషన్ ఉంది. భద్రాచలంరోడ్ పేరిట ఈ స్టేషన్‌ను పిలుస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి రైలు మార్గంలో భద్రాచలం రామాలయానికి వచ్చే భక్తులు కొత్తగూడెం చేరుకుని అక్కడి నుంచి రోడ్డుమార్గంలో భద్రాచలం చేరుకుంటారు. సారపాక వరకు రైల్వేలైను విస్తరిస్తే రామాలయానికి వచ్చే భక్తులు, యాత్రికులతోపాటు ఈ ప్రాంతంలోని పారిశ్రామిక సంస్థలకు మేలు చేకూరుతుంది. కర్మాగారాల్లో ఉత్పత్తి అయిన సరకు రవాణాతోపాటు ముడి సరకు దిగుమతి సులభతరం కానుంది.

అధ్వానంగా రహదారిప్రస్తుతం పాండురంగాపురం రైల్వేస్టేషన్‌లో ఇద్దరు స్టేషన్‌మాస్టర్లు, 20 నుంచి 25 మంది వరకు సిబ్బంది విధులు నిర్వర్తిస్తున్నారు. నాలుగు ప్యాసింజర్ రైళ్లు, 20 వరకు గూడ్స్ రైళ్లు ఈ మార్గంలో నిత్యం ప్రయాణిస్తుంటాయి. మణుగూరు నుంచి అధికంగా బొగ్గు రవాణా చేస్తున్నారు. మణుగూరు అడ్డరోడ్డు నుంచి పాండురంగాపురం రైల్వేస్టేషన్ వరకు సుమారు 10 కిలోమీటర్ల దూరం ఉంటుంది. దీంట్లో కృష్ణసాగర్ నుంచి రైల్వేస్టేషన్ వరకు ఉన్న రహదారి పూర్తిగా పాడైంది. గోతులతో అధ్వానంగా తయారైంది. ఈ మార్గంలో ప్రయాణించేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సిబ్బంది క్వార్టర్లు పూర్తిగా శిథిలమై పనికిరాకుండా పోయాయి. రైల్వే లైను ఏర్పాటైతే సిబ్బంది అనువుగా క్వార్టర్లు సైతం నిర్మించాల్సి ఉంటుంది.

# విమానాశ్రయ మెట్రోకు.. అండర్‌పాస్‌లే సవాల్

హైదరాబాద్: ఓఆర్ఆర్ వెంట మాస్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (ఎంఆర్‌టీఎస్) కోసం 25 మీటర్లు వదలడంతో విమానాశ్రయ మెట్రో నిర్మాణం భూమి మీదనే (ఎట్ గ్రేడ్) పూర్తిగా నిర్మించొచ్చు అని భావించినా క్షేత్రస్థాయి పరిస్థితుల నేపథ్యంలో ఆకాశమార్గానికి (ఎలివేటెడ్) వెళ్లాల్సి వస్తోంది. అవుటర్ వెంట ఏకంగా 200 అండర్‌పాస్‌లున్నాయి. భూమి మీదుగా తక్కువ వ్యయంతో మెట్రో నిర్మాణానికి అవి అడ్డంకిగా మారాయి. దీంతో మెట్రో ఓఆర్ఆర్ వెంట 20 కి.మీ. మేర ఆకాశమార్గంలోనే వెళుతుంది. అందుకు సగటున కి.మీ.కు రూ.200 - రూ.210 కోట్ల వరకు అవుతుందని మెట్రో అధికారులంటున్నారు.

5 మీటర్ల ఎత్తులో..మూడోదశలో విమానాశ్రయ మెట్రో 136 కి.మీ.కు ప్రతిపాదించారు. 4 కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించారు. 37 కి.మీ. భూమి మీదుగా మెట్రో వేయవచ్చని అధికారులు అంచనా వేసినా ఆచరణలో సవాళ్లున్నాయి. 200 అండర్‌పాస్‌ల దగ్గర మార్గం ఎత్తు పెంచాలి. అయితే ఎగుడు దిగుడుగా ఉంటే వేగంపై ప్రభావం



చూపే అవకాశం ఉంది. భద్రత సవాళ్లున్నాయి. దీంతో తక్కువ ఎత్తులో ఎలివేటెడ్ వైపు మెట్రో అధికారులు మొగ్గు చూపారు. నగరంలో రోడ్డు ఇంజినీరింగ్ ప్రమాణాల మేరకు 8-10 మీటర్ల ఎత్తులో మెట్రోరైళ్ల నిర్మాణం చేపడుతుంటారు. కింది నుంచి వాహనాలు వెళ్లేందుగా వీలుగా ఎత్తు విషయంలో ప్రమాణాలు పాటించాలి. అవుటర్‌లో సర్వీస్‌రోడ్డు పక్కన ఎంఆర్‌టీఎస్ కోసం వదిలిన స్థలంలో ఎత్తుపరంగా వెసులుబాటుంది. అండర్‌పాస్‌ల ఎత్తును దృష్టిలో పెట్టుకుని సుమారు 5 మీటర్ల ఎత్తులో మెట్రో మార్గం వేయనున్నట్లు తెలిసింది.

ఎక్కువ మంది ప్రయాణించేలా..

ఇక డిజైన్లపరంగా చూస్తే సిటీ మెట్రో, విమానాశ్రయ మెట్రో వేర్వేరుగా ఉంటాయి. సిటీ మెట్రోలో ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారు. విమానాశ్రయ మెట్రోలో తక్కువ మంది ప్రయాణించొచ్చు. అయితే ప్రస్తుతం మెట్రో కారిడార్ వెంట 30-35 అంతస్తులతో పెద్దఎత్తున భవనాలు నిర్మిస్తున్న నేపథ్యంలో పెద్దసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు సాగించేలా డిజైన్ మార్చారు. ఈ ప్రాజెక్ట్ పనులను సెప్టెంబరు 13న ప్రారంభించేందుకు యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

# వ్యూహాలు.. పథకాలు

హైదరాబాద్: రాబోయే శాసనసభ ఎన్నికలను సమర్థంగా ఎదుర్కొని రాజధాని పరిధిలో మూడొంతుల స్థానాలను దక్కించుకోవడానికి అధికార భారాస వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. 29 నియోజకవర్గాలకుగాను ఇప్పటికే 27 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించేసింది. వారంతా ఈ 3 నెలలు ప్రజల మధ్యే ఉండేలా.. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఇందులో భాగంగా ప్రతి అభ్యర్థితోనూ పార్టీ సీనియర్ నాయకులు మాట్లాడుతూ సమన్వయం చేస్తున్నారు. బుధవారం నుంచి అభ్యర్థులంతా పూర్తిగా జనంలో ఉండేలా ప్రణాళికను అమలులోకి తేబోతున్నారు. కాంగ్రెస్, భాజపాలు తమ అభ్యర్థులను ప్రకటించే సమయానికి నగరంలోని అన్ని డివిజన్లలో సిట్టింగ్ ఎమ్మెల్యేలు పర్యటించేలా కసరత్తు చేయబోతున్నారు. అదే సమయంలో లబ్ధిదారులకు పథకాలు అందేలా ప్రణాళిక రచిస్తున్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ 29 స్థానాలకుగాను 19 స్థానాల్లో విజయ దుందుభి మోగించింది. అప్పట్లో మహేశ్వరం, ఎల్బీనగర్ నుంచి గెల్చిన సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి కాంగ్రెస్ నుంచి గెలిచి అధికార పార్టీలోకి వచ్చారు. ఎంఐఎం 7 స్థానాలను, గోషామహల్‌ను రాజాసింగ్ (భాజపా) కైవసం చేసుకున్నారు. ఈసారి ఎంఐఎం మినహా కాంగ్రెస్, భాజపా స్థానాల్లో కూడా విజయం సాధించాలన్న లక్ష్యాన్ని భారాస పెట్టుకుంది. దీనికోసమే బలమైన అభ్యర్థి కోసం ఈ స్థానంలో ఎవరినీ ప్రకటించకుండా వదిలేసింది.

వరాలిలా..బుధ, గురువారాల్లో ఎమ్మెల్యేల చేతుల మీదుగా ఒక్కో నియోజకవర్గంలో 300 మంది బీసీ కులవృత్తిదారులకు ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిసింది. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరగబోతోంది. ఈ నెలాఖరున



లేదా వచ్చేనెల మొదటివారంలో 70,000 రెండు పడక గల ఇళ్ల పంపిణీకి ఏర్పాట్లు చేస్తున్నారు. లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలు కీలకపాత్ర పోషిస్తున్నారు.

ప్రచారం షురూ

మరోవైపు టిక్కెట్లు పొందిన ఎమ్మెల్యేలు.. దానం నాగేందర్, వివేకానంద్, మాధవరం కృష్ణారావు, ఆరెకపూడి గాంధీ, సుధీర్‌రెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, ప్రకాష్‌గౌడ్ తదితరులు మంగళవారం నుంచి అధికారికంగా ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. మిగిలినవారు కూడా ఇదే బాటలో ఉన్నారు. వచ్చే ఎన్నికల్లో పోటీ చేసేందుకు సీట్లు ఖరారు కావడంతో సంబంధిత అభ్యర్థుల ఇళ్ల వద్ద సందడి నెలకొంది. కార్యకర్తలు భారీగా తరలివచ్చి ఎమ్మెల్యేలను అభినందనలతో ముంచెత్తారు.

నేడు, రేపు బీసీ కులవృత్తులకు రూ. లక్ష సాయం

-మంత్రి తలసాని నగరంలోని బీసీ కులవృత్తిదారులకు ప్రభుత్వం అందించే రూ.లక్ష సాయాన్ని అందజేయనున్నట్లు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ పేర్కొన్నారు. ఎంపిక చేసిన లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేస్తామని వెల్లడించారు. మొదటి దశ కింద నియోజకవర్గానికి 300 మంది లబ్ధిదారులను ఎంపిక చేశామన్నారు. సనత్‌నగర్, జూబ్లిహిల్స్, ముషీరాబాద్, అంబర్‌పేట, ఖైరతాబాద్, కంటోన్మెంట్ నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలతో కలిసి అందిస్తామన్నారు.

# పేరు ఘనం.. వసతి శూన్యం

కరీంనగర్: ఇంటర్ పరీక్షలు సమీపిస్తున్నాయి. ఫిబ్రవరిలో ప్రయోగ పరీక్షలు. మార్చిలో వార్షిక పరీక్షలు. ఆ నెలాఖరులో మూల్యాంకనం. ఇది అధికారులకు సమస్యగా మారింది. కారణం కావాల్సిన భవనం లేకపోవడం. రాష్ట్రంలో రెండో మూల్యాంకన కేంద్రం కరీంనగర్. అత్యధిక సబ్జెక్టులు ఇక్కడే దిద్దుతారు. ఆ మేరకు వసతులు లేవిక్కడ. మూడు చోట్ల మూల్యాంకనం చేస్తారు. ఇంటర్ బోర్డు అధిక వ్యయం చేయాల్సిన దుస్థితి. వాస్తవానికి ఉన్నతాధికారులు స్పందించి చొరవ తీసుకుంటే భవన నిర్మాణం జరిగే అవకాశముంది. అంతకు ముందు ప్రస్తుతం వినియోగిస్తున్న కార్యాలయం ఇంటర్ బోర్డు పేరిట మోటేషన్ కావాల్సి ఉంది. ఇందుకు లేఖలు ఒక శాఖ నుంచి మరొక శాఖకు తిరుగుతూనే ఉన్నాయి.

సమస్య ఏమిటంటే?

స్టేప్‌కార్ కార్యాలయాన్ని ఇంటర్ విద్యకు కేటాయించారు. అయితే ఆ స్థలం, భవనం టీసీఐఐసీ (పరిశ్రమల శాఖ) ఆధీనంలో ఉంది. 2017 నుంచి అక్కడ డీవీఈవో కార్యాలయం కొనసాగుతోంది. ఇందుకు ఇంటర్ బోర్డు ఆస్తి పన్ను చెల్లించాలి. నగర పాలక సంస్థ నుంచి కార్యాలయానికి చెల్లించాలని నోటీసులు అందాయి. ఆ మొత్తం ఇంటర్ బోర్డు కమిషనర్ మంజూరు చేయాల్సి ఉంది. వినియోగిస్తున్న భవనం ఇంటర్ బోర్డు పేరిట మోటేషన్ చేస్తే సంబంధిత నిధులు లభిస్తాయని బోర్డు స్పష్టం చేసింది. ఇదే విషయాన్ని డీఐఈవో కార్యాలయం నగర పాలక సంస్థ కమిషనర్‌కు లేఖ రాసింది. ఆ తర్వాత 2020 నుంచి మోటేషన్ కోసం కలెక్టర్‌కు లేఖలు రాశారు. 2022లో టీసీఐసీసీ జోనల్ మేనేజర్‌కు కలెక్టర్ నుంచి సిఫారసు వెళ్లింది. ఇదే విషయాన్ని జిల్లా అధికారులు పరిశ్రమల శాఖ మేనేజింగ్ డైరెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. నేటికి సమస్య పరిష్కారం కాలేదు.

భవనం నిర్మిస్తేనే..పరిశ్రమల శాఖ మోటేషన్‌కు అనుమతిస్తే భవనం ఇంటర్ బోర్డు ఆధీనంలోకి వస్తుంది. అప్పుడు కావాల్సిన నిధుల మంజూరు చేయడంలో నగర పాలక సంస్థకు బకాయిపడ్డ రూ.5 లక్షలు చెల్లించేందుకు అవకాశం ఉంటుంది. మూల్యాంక శిబిరానికి అనువుగా ఇక్కడ భవన నిర్మాణానికి మార్గం సుగమమవుతుంది. ఇందుకు ఇంటర్ బోర్డు కూడా సానుకూలంగా ఉంది. జిల్లా కలెక్టర్‌తోపాటు పరిశ్రమల శాఖ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తే సమస్య పరిష్కారమవుతుందని ప్రధానాచార్యులు, అధ్యాపకులు అభిప్రాయపడుతున్నారు.

రాష్ట్రంలో 5 లక్షల సమాధాన పత్రాలు ఇక్కడికే

పాత జిల్లా కేంద్రాల్లో మూల్యాంకనం జరుగుతుంది. రాష్ట్రంలో వరంగల్ మొదటి స్థానంలో ఉండగా, కరీంనగర్ శిబిరం రెండో స్థానం ఉంది. ఇక్కడే 5 లక్షలకు పైగా సమాధాన పత్రాల మూల్యాంకనం చేస్తారు. అన్ని సబ్జెక్టులు కలుపుకొని సుమారు 2 వేల మంది అధ్యాపకులు పలు విడతల్లో 30 రోజులపాటు శ్రమిస్తారు. ప్రభుత్వ కళాశాలల్లో సరిపడా వసతులు లేవు. వాస్తవానికి ఒకే చోట శిబిరం ఏర్పాటు చేయాలి. కానీ ఇక్కడ మూడు ఉన్నాయి.

గతంలో ఇలా..జిల్లా కేంద్రంలోని ముకరంపురలో ఇంటర్ విద్యా కార్యాలయం. దాని పక్కనే ప్రభుత్వ ఆర్ట్స్ జూనియర్ కళాశాల. కార్యాలయంలో కొన్ని సబ్జెక్టుల అధ్యాపకులు పేపర్లు దిద్దేవారు. అక్కడే స్ట్రాంగ్ రూంతోపాటు పర్యవేక్షణ జరిగేది. ఆర్ట్స్ కళాశాలలో 30 గదుల్లో గరిష్ఠ అంశాల మూల్యాంకనం కొనసాగేది. ఏటా మూడు విడతల్లో ఆయా సబ్జెక్టుల సమాధాన పత్రాలను అధ్యాపకులు దిద్దేవారు. అయితే ఇప్పుడవి లేకపోవడం సమస్యగా మారింది.

ఇప్పుడు ఇలా..స్మార్ట్‌సిటీలో భాగంగా ఆర్ట్స్ కళాశాలను కూల్చివేశారు. ఇప్పుడక్కడ పార్కు నిర్మిస్తున్నారు. అప్పటి కలెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్ ఆర్ట్స్ కళాశాలకు ఇంటర్ విద్యా కార్యాలయం (ఆర్ఐవో) కేటాయించారు. అక్కడ కొనసాగుతున్న కార్యాలయాన్ని పద్మానగర్‌లోని స్టేప్‌కార్ కార్యాలయానికి మార్చారు. కలెక్టర్ ఆదేశాల మేరకు 2017లో ఆర్ఐవో కార్యాలయం కలెక్టర్‌కు అప్పగించి పద్మానగర్‌కు షిఫ్ట్ చేశారు. పాత ఆర్ఐవో ఆఫీసులో ఇప్పుడు ఆర్ట్స్ కళాశాల కొనసాగుతోంది. మొదట అసౌకర్యంగా ఉన్నా తాత్కాలిక గదులు, మరమ్మతులతో ఫర్వాలేదు. మూల్యాంకనం కోసం జ్యోతినగర్‌లోని లయోలా కళాశాలను ఆశ్రయించారు. రెండేళ్లు గడిచాక వారు నిరాకరించారు. గత్యంతరం లేక పద్మానగర్‌లో ఇంగ్లిష్, సంస్కృతం మూల్యాంకనం జరుగుతోంది. తెలుగు, హిందీతోపాటు ఆర్ట్స్, కామర్స్ సబ్జెక్టులు ఆర్ట్స్ కళాశాలలో, సైన్స్, మ్యాథ్స్ సబ్జెక్టులు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో నిర్వహించాల్సి వస్తోంది. పద్మానగర్‌లోని స్ట్రాంగ్ రూం నుంచి సమాధాన పత్రాలు రెండు చోట్లకు రవాణా చేయడం సమస్యగా మారింది. రవాణా ఖర్చు పెరిగింది. మూడు చోట్ల విద్యుత్ ఛార్జీలు భరించాల్సిన పరిస్థితి.

## అంచనాలకు మించి వరి సాగు

కరీంనగర్: ఈ యాసంగిలో సైతం జిల్లా రైతులు వరి సాగు వైపే అధికంగా మొగ్గు చూపారు. గతేడాది ప్రత్యామ్నాయ పంటలు వేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. సందిగ్ధులో కొందరు ప్రత్యామ్నాయ పంటల వైపు వెళ్లారు. ఈసారి అలాంటి ప్రకటన ఏమి చేయకపోవడంతో అంచనాలకు మించి వరి సాగు చేస్తున్నారు. ఈ యాసంగిలో ఇప్పటి వరకు సాగు చేసిన పంటల వివరాలపై కథనం.గతేడాదికన్నా 7 వేల ఎకరాలు అధికంగత యాసంగి సీజన్‌లో జిల్లాలో 2,46,893 ఎకరాల్లో వరి సాగు విస్తీర్ణం నమోదైంది. ఈ యాసంగిలో 2,44,000 వరకు వరి విస్తీర్ణం ఉండవచ్చని జిల్లా వ్యవసాయ అధికారులు అంచనాలు తయారు చేశారు. కానీ అంతకు మించి 2,54,015 ఎకరాల్లో ఇప్పటికే వరి సాగు చేశారు. మరికొన్ని చోట్ల ఇప్పటికీ సాగుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. మొత్తంగా అధికారుల అంచనాలకు మించి ఇప్పటికే 7 వేల ఎకరాల వరకు పెరగగా, మరో పక్షం రోజుల్లో వేసే నాట్లతో కలిపి గతేడాదితో పోల్చితే పది వేల ఎకరాలు అధికంగా సాగయ్యే అవకాశముందని జిల్లా వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు.

పెరుగుదలకు కారణాలు గతేడాది మాదిరిగానే ఈ ఏడాది అధిక వర్షాలు పడడంతో జిల్లాలో భూగర్భ జలాలపై బెంగ లేదు. అంతేగాకుండా కాళేశ్వరం పంపులు తిరిగి పనిచేయడంతో కాలువల కింద పంటలు వేసుకునే వారందరిలో నీటి విడుదలపై భరోసా వచ్చింది. సాగుకు సరిపడా విద్యుత్తు సరఫరా విషయంలో కూడా పెద్దగా ఇబ్బందులుండవనే హామీతో రైతుల్లో సాగుపై మరింత భరోసా కల్గింది. గత రబీ సీజన్‌లో వచ్చిన వరి ధాన్యాన్ని మొత్తంగా ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వం కొనుగోలు చేయడంతో రైతుల్లో కొనుగోళ్లపై ఉన్న అపోహలు తొలిగిపోయినట్లు అయింది. అంతేగాకుండా ప్రపంచ మార్కెట్‌లో వరికి డిమాండ్ ఉండడంతో రబీ ధాన్యాన్ని ప్రైవేట్‌గా మిల్లర్లు సైతం పోటీపడి కొనుగోలు చేశారు. ఈ పరిణామాలు రైతుల్లో యాసంగి ధాన్యం కొనుగోళ్లపై నమ్మకాన్ని పెంచినట్లు అయింది.క్రాప్ బుకింగ్ విధానంతో...సంబంధిత వ్యవసాయ అధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియ ద్వారా పంటల సాగు వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తున్నారు. రైతుల వారీగా నీటి వసతి, అందుబాటులో ఉన్న వనరులు, మార్కెటింగ్ సదుపాయం తదితర వివరాలనూ నమోదు చేస్తున్నారు.

పకడ్బందీగా వివరాల నమోదు

క్రాప్ బుకింగ్ విధానంతో పంట సాగు వివరాలను పకడ్బందీగా నమోదు చేస్తున్నాం. 95 శాతం వరకు వివరాల నమోదు పూర్తయింది. కొన్ని చోట్ల ముందుగా నాట్లు వేసిన వాటికి మొగి పురుగుతో ఇబ్బందులు ఏర్పడ్డాయి. వారందరూ తిరిగి నాట్లు వేస్తున్నారు. మరో ఐదు శాతం సాగు వివరాల నమోదు ప్రక్రియ పూర్తి చేయాల్సి వచ్చింది.

# అక్రమ లేఅవుట్ల జోరు..



వరంగల్ : అనధికార లేఅవుటు స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులు ఇవ్వకూడదని పురపాలక చట్టం 2019 చెబుతోంది. మరోవైపు 'లేఅవుటు రెగ్యులరైజేషన్ స్కీం(ఎల్‌ఆర్‌ఎస్) భవిష్యత్తులో ఉండదని రాష్ట్ర పురపాలక శాఖ తేల్చి చెప్పింది. అయినా వరంగల్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పట్టణాల్లో విచ్చలవిడిగా అనధికార లేఅవుట్లు వెలుస్తున్నాయి. ఫలితంగా గ్రేటర్ వరంగల్, కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ(కుడా), ఉమ్మడి జిల్లాలోని పురపాలక సంస్థల ఆదాయానికి రూ.కోట్లలో గండి పడుతోంది. వీటి వెనుక రాజకీయ అండదండలుండటంతో టౌన్‌ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు ఉంటున్నారు.

వ్యాపారుల నయా దందా గ్రేటర్, 'కుడా' పరిధిలో వందల సంఖ్యలో అక్రమ లేఅవుట్లు వెలుస్తున్నాయి. స్థిరాస్తి వ్యాపారులు(రియాల్టర్లు) చాలా తెలివిగా ప్లాట్లు అమ్ముతున్నారు. అనధికార లేఅవుట్ల కోసం ఎకరాల చొప్పున భూములు కొనుగోలు చేసి ప్లాట్లు చేస్తున్నారు. ఎవరికీ అనుమానం రాకుండా రిజిస్ట్రేషన్ శాఖాధికారులకు ముడుపులు ముట్టజెప్పి గుంటల చొప్పున స్థలాలు అమ్ముతున్నారు. గతేడాది నుంచి నయా దందా మొదలు పెట్టారు. గుంటల చొప్పున అమ్మితే వ్యవసాయ భూమిగా రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు. తర్వాత భవన నిర్మాణ అనుమతులకు వాడుతున్నారు. వరంగల్ నగర పరిధిలోని విలీన గ్రామాల్లో ఎక్కువగా చిన్న చితక లేఅవుట్లు చేస్తున్నారు. అనుమతులు పొందకుండానే మూడో కంటికి తెలియకుండా స్థలాలు అమ్మేస్తున్నారు. వసంతపూర్, దూపకుంట, బొల్లికుంట, సింగారం, నక్కలపెల్లి, గాడిపెల్లి, స్తంభంపెల్లి, ధర్మారం, గొర్రెకుంట, పోతరాజుపల్లి, కొత్తపేట, పైడిపల్లి, ఆరెపల్లి, నాగారం, హసన్‌పర్తి, ఎల్లాపూర్, దేవన్నపేట శివారు, మడికొండ శివారు, భట్టుపల్లి, కడిపికొండ, తరాలపల్లి, తిమ్మాపూర్ విలీన గ్రామాల్లో అక్రమ లేఅవుట్ల జోరు ఎక్కువగా ఉంది.'కుడా' పరిధిలోని కమలాపూర్, ఎల్కతుర్తి, హుజురాబాద్ శివారు, స్టేషన్‌ఘన్‌పూర్, రఘునాథ్‌పల్లి, చిల్పూరుగుట్ట, ధర్మసాగర్, వర్ధన్నపేట, ఐనవోలు, గీసుకొండ మండల శివారుల్లో ఇదే విధానం ఉంటోంది. పున్నేలులో 20 ఎకరాలు, పంథినిలో 35, ఐనవోలులో 40, సింగారంలో 36 ఎకరాల్లో అక్రమ వెంచర్లు ఉన్నాయి. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ శాఖల్లో సర్వే నంబర్లు సరిచూసుకొని కొనుగోలు చేయాలని, లేకుంటే మోసపోతారని స్థానికులు పేర్కొంటున్నారు. హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలం ముచ్చర్ల గ్రామంలో చెరువు శిఖం భూమినే పలువురు రియల్టర్లు అధికారుల అండతో కబ్జా చేసి ఆ భూమిలోనే వెంచర్ వ్యాపారానికి తెర లేపారు. చుట్టూ ప్రహరీని నిర్మించి తక్కువ ధరకే స్థలం అంటూ ప్రచారం చేపట్టారు. హసన్‌పర్తి మండలం నాగారం పెద్ద చెరువు సమీపంలో పలువురు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే వెంచర్ పేరుతో భూదందా సాగిస్తున్నారు. హసన్‌పర్తి మండలం పెంబర్తిలో రియల్టర్లు ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే రియల్ ఎస్టేట్ దందా నడుపుతున్నారు. నిబంధనలు ఇలాలేఅవుటు అనుమతులు పొందాలంటే ఆ స్థలంలో రోడ్లు, డ్రైనేజీలు, విద్యుత్తు స్తంభాలు, నీటి సరఫరా తదితర మౌలిక వసతులు కల్పించాలి. 'నాలా' పేరుమార్పిడి, డెవలప్‌మెంటు ఛార్జీలు చెల్లించాలి. ప్రజల అవసరాల కోసం 10 శాతం ఖాళీ స్థలాన్ని కేటాయించాలి. గ్రేటర్, పురపాలికలకు లేఅవుటు అనుమతుల రుసుములు ఒక ఎకరానికి సుమారు రూ.15-20 లక్షలు ఉంటుంది. జిల్లా కలెక్టర్లు లేఅవుటు అనుమతులు జారీ చేస్తారు. స్థానిక సంస్థల అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేస్తారు.వర్ధన్నపేట మండలం ఇల్లందలోని పాత పాలకేంద్రానికి చెందిన సుమారు ఆరెకరాల భూమిని ఇటీవల కొందరు కొనుగోలు చేశారు. పూర్తి స్థాయిలో అనుమతులు తీసుకోకుండానే భూమిని ప్లాట్లుగా విభజించడంతో పాటు, రోడ్లు ఇతర పనులు చేపట్టారు. ఈ విషయమై ఎంపీడీవో రాజలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి రామారావును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. సంబంధిత భూమికి ఎటువంటి అనుమతులు రాలేదని తెలిపారు. భూ వివాదం నేపథ్యంలో కోర్టులో కేసు నమోదైనట్లు చెప్పారు.

అక్రమ లేఅవుటు ప్లాట్లతో నష్టాలు

భవన నిర్మాణాలకు అనుమతి ఇవ్వరు. అక్రమ లేఅవుట్‌లో కొనుగోలు చేసిన స్థలానికి ఒకవేళ టీఎస్-బీపాస్ ద్వారా భవన నిర్మాణ అనుమతి పొందాలంటే ఖాళీ స్థలం పన్ను (షాటు ఫాల్ ఆఫ్ ఓపెన్ ప్లేస్), ఫీనలైజేషన్ పన్ను, సర్‌ఛార్జీ పన్నులు చెల్లించాలి. ఇది మొత్తం రూ.లక్షల్లో ఉంటుంది.బ్యాంకుల ద్వారా రుణం లభించదు.భవిష్యత్తులో స్థలాలపై న్యాయపరమైన ఇబ్బందులు వస్తాయి ఆక్రమణలకు అవకాశం ఉంటుంది.రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్తు స్తంభాలు, ఇతర మౌలిక వసతులు ఉండవు ఎలా గుర్తించాలి కొంత మంది స్థిరాస్తి వ్యాపారులు లేఅవుటు అనుమతులున్నాయని వినియోగదారులను మోసం చేస్తున్నారు.లేఅవుటు అనుమతి పొందితే డీపీ నెంబరు అడగాలి. ఇది కలిగి ఉంటేనే అనుమతి ఉన్నట్లు గుర్తించాలి.. లేఅవుటు కాలనీ నక్షా (ప్లాన్) చూడాలి.పార్కులు, ఖాళీ స్థలాల వివరాలు పరిశీలించాలి అంతర్గత రహదారి ప్లాన్‌లో చూసుకోవాలి.

# ఇటు కమిటీ విచారణ.. అటు జీరో దందా

వరంగల్ : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో జీరో దందాను నియంత్రించేందుకు ఓవైపు మార్కెట్ శాఖకు చెందిన ప్రత్యేక పరిశీలన బృందం విచారణ చేపడుతుండగానే, మరోవైపు కొంతమంది వ్యాపారులు జీరో దందా కొనసాగించారు. ఇటీవల మార్కెట్‌లో నకిలీ తక్‌పట్టీలతో మార్కెట్ ఆదాయానికి గండిపడుతున్న అంశంపైలో వచ్చిన వరుస కథనాలకు రాష్ట్ర మార్కెటింగ్ శాఖ స్పందించి జిల్లా స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక విచారణ బృందాన్ని నియమించిన విషయం తెలిసిందే. తాజాగా బృందం మార్కెట్‌లో గేట్ ఎంట్రీలు, తక్‌పట్టీలు, బిడ్డింగ్ రిజిస్టరు, కొనుగోళ్ల తీరును పరిశీలిస్తున్న సమయంలో ఆర్కే ఎంటర్‌ప్రైజెస్, జైగణేశ్ ట్రేడింగ్ అడ్తీదారులకు సంబంధించిన మిర్చిని భారత్ ఎంటర్‌ప్రైజెస్ వ్యాపారి జీరో కాంటాలు నిర్వహిస్తూ దొరికిపోయారు. విచారణ కమిటీ అధికారి ప్రసాద్‌రావు ఆదేశాల మేరకు మార్కెట్ కార్యదర్శి రాహుల్ గ్రేడ్ 2 కార్యదర్శి, సహ కార్యదర్శి, మిర్చియార్డు సూపర్‌వైజర్‌కు మెమోలు జారీచేయడంతో పాటు సదరు వ్యాపారులను, దడవాయిని వారం పాటు సస్పెండ్ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనతో మిర్చి యార్డు సూపర్‌వైజర్ నర్సింహ సెలవుల్లో వెళ్లిపోయారు. తగ్గిన ఆదాయంఏటా ఫిబ్రవరి, మార్చి నెలల్లో వేల క్వింటాల మిర్చి పంటను రైతులు మార్కెట్‌కు తీసుకొస్తారు. ఈ రెండు నెలల్లోనే మార్కెట్‌లో రూ.కోట్లలో జీరో దందా జరుగుతోంది. సాధారణంగా మార్కెట్‌లో కొనుగోలు చేసిన పంట ఉత్పత్తుల ఆధారంగా వ్యాపారులు మార్కెటింగ్ శాఖకు సెస్, వాణిజ్య పన్నుల శాఖకు 5 శాతం చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్‌కు వస్తున్న పంట ఉత్పత్తుల మొత్తానికి పన్నుల వసూలు కావడం లేదు. సుమారు 30 నుంచి 40 శాతం పంట ఉత్పత్తులను రికార్డుల్లో చేర్చకుండానే వ్యాపారులు బయటికి తరలిస్తున్నారు. దళారులకు మార్కెట్‌లోని కొంతమంది అధికారులు, సిబ్బంది సహకరిస్తున్నారు. జోరుగా జీరోదందా కొనసాగుతుండడంతో ఈ ఏడాది మార్కెట్ ఆదాయ లక్ష్యం రూ.40 కోట్లు నిర్దేశించుకోగా, ఇప్పటివరకు రూ.25 కోట్ల మేర మాత్రమే సమకూరింది.కఠిన చర్యలు తీసుకుంటున్నాం..-బి.వి.రాహుల్, మార్కెట్ ఉన్నతశ్రేణి కార్యదర్శిమార్కెట్‌లో పంట ఉత్పత్తులను రికార్డు చేయకుండా కొనుగోలు చేస్తున్న వ్యాపారులపై దృష్టిసారించాం. ఎలాంటి జీరో దందా జరగకుండా అధికారులను అప్రమత్తం చేశాం. గత వారంలో పంట ఉత్పత్తులను జీరోలో కొనుగోలు చేసిన వ్యాపారిని వారం పాటు మార్కెట్‌లో కొనుగోళ్లు చేయకుండా వేటు వేశాం. అప్రమత్తంగా లేని యార్డు అధికారులకు మెమోలు జారీచేశాం.

## ఆధార్‌తో జత.. పనిలో పారదర్శకత!

కరీంనగర్: ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేసే క్రతువులో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జోరు చూపిస్తోంది. పని ప్రదేశంలో అక్రమాలకు చెక్ పెట్టేందుకు కీలకమైన ఆధార్ అనుసంధానంలో నాలుగు జిల్లాలు ముందు వరుసలో ఉన్నాయి. దాదాపు 94 శాతం జాబ్‌కార్డుతో జత చేశాయి. ఈ విధానాన్ని వేగంగా అమలు చేస్తున్న జిల్లాల జాబితాలో మన జిల్లాలు అగ్రభాగాన ఉన్నాయి. జనవరి మొదటి వారంలో ప్రారంభమైన కార్యక్రమం మరో వారం రోజుల్లో శతశాతాన్ని చేరుకోనుంది. మొదట్లో క్షేత్ర స్థాయిలో ఈ పని మందకొడిగా కనిపించినా.. గత నెలాఖరులో మాత్రం చివరి దశకు చేరుకుంటుంది. అవకతవకలు తొలిగేలా..!ఊరూరా చేపడుతున్న పనుల్లో అసలు తప్పులకు చోటులేకుండా పనిని సజావుగా, పారదర్శకంగా జరిపించే ఉద్దేశంతో గత నెల మొదటి రోజు నుంచి ఆన్‌లైన్ హాజరును తెరపైకి తీసుకొచ్చారు. గతంలో సామాజిక తనిఖీల సమయంలో బయటపడ్డ నిధుల దుర్వినియోగం, అవకతవకలను దృష్టిలో పెట్టుకుని ఈ విధానాన్ని అమలు చేస్తున్నారు. అసలు కూలీలు పనికి రాకుండానే దినసరి వేతనాలను కాజేసిన ఉదంతాలు కోకొల్లలు. అందుకనే కేంద్ర ప్రభుత్వం ఊళ్లల్లో చేపట్టే ప్రతి పని పక్కాగా జరపాలనే సదుద్దేశంతోపాటు ప్రజల సొమ్మును సరైన పనులకు వినియోగించుకునే ఈ విధానాన్ని అమలు చేస్తోంది. ఇప్పటికే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో పనికి సక్రమంగా వచ్చే వారి వివరాలను నేషనల్ మొబైల్ మానిటరింగ్ యాప్ (ఎన్‌ఎంఎంఎస్)లో పొందుపర్చారు. గతంలోనే ఆధార్‌తో జత కలిసిన కార్డులను గుర్తించడంతోపాటు కొత్త జాబ్‌కార్డులను జత చేసే పనిలో ఉపాధి హామీ సిబ్బంది నిమగ్నమయ్యారు. చాలాచోట్ల పేర్లు, వయసు సహా ఇతరత్ర ఇక్కట్లతో అనుసంధానంలో తిరస్కరణకు గురవుతున్న వాటి సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. వీటిని మరోమారు పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

# మిరప రైతుకు నష్టాల ఘాటు

మేళ్లచెరువు : ఈసారీ మిరప రైతుకు నష్టాల ఘాటు తగిలింది. ఎర్ర బంగారంపై పెట్టుకున్న ఆశల్ని నల్లి నమిలేసింది. ధర కాస్త ఆశాజనకంగా ఉన్నా.. దిగుబడుల అంచనాలు తలకిందులయ్యాయి. ఆశించిన ఆదాయం ఆవిరైంది. మొత్తంగా ఉమ్మడి జిల్లా మిరప రైతులు రూ.వందల కోట్లు కోల్పోవాల్సి వచ్చింది.

రూ.కోట్ల ఆదాయం కోల్పోయిన వైనం

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులు దాదాపు 30 వేల ఎకరాల్లో మిరప పంట వేశారు. కానీ పూత దశలోనే నల్లి బాగా వ్యాపించి పూతను తినేసింది. గతేడాదీ ఇదే పరిస్థితి. బొబ్బ రోగం దీనికి తోడైంది. ఆకులన్నీ ముడుచుకుపోయాయి. పూత, ఆకు పాడై మొక్క మోడువారింది. దీంతో కాయ నిలవలేకపోయింది. ఎకరానికి 25 క్వింటాళ్ల పైనే రావాల్సిన దిగుబడులు 10 క్వింటాళ్లు మించలేదు. ఇందులోనూ సగం తాలు కాయలే దర్శనమిస్తున్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు 80 శాతం 5-6 క్వింటాళ్లకే పరిమితమైంది. మిరప పూత



దశలో ఉండగా క్వింటా గరిష్ఠ ధర రూ.30 వేలు పలుకగా.. ప్రస్తుతం రూ.18 వేలకు పడిపోయింది. దిగుబడులూ అయిదింతలు తగ్గిపోయాయి. ఎకరానికి రూ.లక్ష వరకూ పెట్టుబడులకు వెచ్చించారు. ఆదాయం రాకపోగా నష్టాల ఘాటు తగలడంతో మిరప రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

మూడున్నర క్వింటాళ్లే

సక్రి, శివబాలాజీనగర్ తండా

మేం రెండెకరాల పది కుంటలు కౌలుకు తీసుకున్నాం. రూ.54 వేలు కౌలు చెల్లించాం. 50 క్వింటాళ్ల మిరప వస్తుందనుకున్నాం. నల్లి, బొబ్బ రోగం పంటను దెబ్బతీశాయి. ఎన్ని మందులు కొట్టినా పంట దక్కలేదు. మొత్తం కలిపి మూడున్నర క్వింటాళ్లు కూడా చేతికందడం లేదు. ఆర్నెళ్ల కష్టం పోయింది. అప్పు మిగిలింది.

## ఆన్‌లైన్లో జనన.. మరణాలు

మేళ్లచెరువు : గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారి వివరాలను అంగన్‌వాడీ టీచర్ రికార్డులలో నమోదు చేసేవారు. కుటుంబీకులు పంచాయతీ కార్యదర్శికి లిఖితపూర్వక లేఖ అందించి జనన, మరణ ధ్రువీకరణ పత్రం పొందేవారు. తాజాగా మారిన విధానం ప్రకారం సదరు అర్జీని మీ-సేవ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. ఆ వివరాలు నిర్ధారించిన తర్వాత పంచాయతీ కార్యదర్శి రికార్డుల్లో నమోదు చేసి ధ్రువీకరణ పత్రం జారీ చేస్తారు. దీనిని మీ-సేవ కేంద్రం నుంచి పొందాలి. గతంలో పురపాలికల్లో అమలు చేసిన ఈ పద్ధతిని ప్రస్తుతం గ్రామాలకు విస్తరించారు.

పారదర్శకతకు పెద్దపీట..జనన, మరణ వివరాలను కార్యదర్శి రికార్డుల్లో నమోదు చేసి ఏడాది పాటు పంచాయతీలోనే ఉంచుతారు. తర్వాత వాటిని తహసీల్దార్‌కు శాశ్వత ప్రాతిపాదికన అప్పగిస్తారు. అనంతరం దస్త్రాల్లో ఉన్న వారి వివరాలతో ధ్రువపత్రాలు జారీ చేస్తారు. ఏళ్ల క్రితం మరణించిన వ్యక్తుల వివరాల సేకరణ కష్టమవడంతోపాటు న్యాయపరమైన ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంటుంది. ప్రస్తుత ఈ



విధానంతో ఈ సమస్యలకు పరిష్కారం దొరకనుంది. జనన, మరణాల పత్రాలు రాని పక్షంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలు సహా ఇతర చిక్కులకు దారితీసిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. ప్రస్తుతం కుటుంబ సభ్యులు మీ-సేవలో రూ.45 రుసుం చెల్లించి రాష్ట్రంలో ఎక్కడి నుంచైనా పత్రాలు తీసుకునే వీలుంది. మరణించిన వ్యక్తి పేరుతో ఒక్కసారి ధ్రువపత్రం జారీ అయితే ఎవరి ప్రమేయం లేకుండానే ఆసరా పింఛన్, రేషన్ బియ్యం, ఓటరు గుర్తింపు కార్డు రద్దవుతుంది.

పూర్తి స్థాయి శిక్షణ లేక..ఈ-పంచాయతీలు ఏర్పాటు చేసి కంప్యూటర్లు సరఫరా చేసినా.. వాటి నిర్వహణలో కార్యదర్శులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇవ్వలేదు. కొన్ని గ్రామ పంచాయతీల్లో కంప్యూటర్లు లేకపోగా, మరికొన్నింటిలో అంతర్జాల సౌకర్యం లేదు. ఇళ్ల నిర్మాణ అనుమతుల కోసం పల్లె వాసులు ఆన్‌లైన్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు. తాజాగా జనన, మరణ ధ్రువీకరణ వినతులు ఇలానే వస్తున్నాయి. ఇప్పటికైనా కార్యదర్శులకు పూర్తి స్థాయిలో శిక్షణ ఇస్తే పారదర్శకతకు ప్రాధాన్యం ఇచ్చినట్లు అవుతుంది.

## ఓట్లు అమ్ముకోవద్దు: విశారదన్ మహారాజ్

కేతేపల్లి : జనాభాలో తొంభైశాతం మంది ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల పేదప్రజలు ఎన్నికల్లో ప్రలోభాలకు తమ ఓట్లను అమ్ముకోవద్దని దళిత్ శక్తి ప్రోగ్రాం (డీఎస్‌పీ) రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్ మహారాజ్ చెప్పారు. దళితులకు రాజ్యాధికారమే ధ్యేయంగా 11 నెలల క్రితం ప్రారంభించిన స్వరాజ్య పాదయాత్ర కేతేపల్లి మండలంలోని ఉప్పలపహాడ్, చీకటిగూడెం, కేతేపల్లి, కొర్లపహాడ్, ఇనుపాముల గ్రామాల మీదుగా కొనసాగింది. కార్యక్రమాలలో విశారదన్ మహారాజ్ మాట్లాడుతూ.. జనాభాలో పదిశాతం మంది మాత్రమే ఉన్న అగ్రవర్ణాల వారు పేదల ఓట్లను కొని అధికారంలోకి వచ్చి రాజ్యాంగానికి విరుద్ధంగా పరిపాలన చేస్తున్నారని విమర్శించారు. దేశంలో పాలక ప్రభుత్వాలు రాజ్యాంగ సూత్రాలను పదిశాతం కూడా పాటించడం లేదని చెప్పారు. అట్టడుగు వర్గాలవారు తమ ఓట్లను తమ ప్రతినిధులకే వేసుకొని రాజ్యాధికారం సాధిస్తేనే రాజ్యాంగ ఫలాలు క్షేత్రస్థాయిలో నిరుపేదలకు అందుతాయని తెలిపారు. డీఎస్‌పీ రాష్ట్ర నాయకుడు గిరి, జిల్లా అధ్యక్షుడు సైదులు, మండల ఇన్‌ఛార్జి వెంకన్న, నాయకులు శేఖర్, జానయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# వాన్‌పిక్ కేసులో ఏపీ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు



ఢిల్లీ: వాన్‌పిక్ కేసులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులిచ్చింది. తదుపరి విచారణ, ఉత్తర్వులిచ్చేవరకు 'స్టేటస్ కో' అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. వాన్‌పిక్‌కు అనుకూలంగా హైకోర్టు ఇచ్చిన తీర్పుపై ఈడీ సుప్రీంను ఆశ్రయించింది. ఈ కేసుపై ఇవాళ విచారణ చేపట్టిన జస్టిస్ అభయ్ ఎస్.ఓకా, జస్టిస్ పంకజ్ మిట్టల్‌తో కూడిన ధర్మాసనం ప్రతివాదులకు నోటీసులు జారీ చేయాలని ఆదేశించింది.

**వాన్‌పిక్ ప్రాజెక్టు తరపు వాదనలు** ఇప్పటికే 15 ఏళ్లు వృథాగా గడిచిపోయాయని వాన్‌పిక్ ప్రాజెక్టు తరఫు న్యాయవాది సుప్రీం ధర్మాసనం ముందు వాదనలు వినిపించారు. "దేశాల మధ్య సంబంధాలకు ఈ అంశం ముడిపడి ఉంది.

విచారణ జాప్యంతో ప్రాజెక్టు ముందుకు కదలట్లేదు. మొత్తం ప్రాజెక్టు భూములను ఈడీ అటాచ్ చేయడం తగదు" అని వాన్‌పిక్ తరఫు న్యాయవాది సుప్రీం దృష్టికి తీసుకెళ్లారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి సీఎంగా ఉన్నప్పుడు 2008లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం జిల్లాల్లోని తీర మండలాల్లో వాన్‌పిక్ ప్రాజెక్టు కోసం 22 వేల ఎకరాలను సేకరించారు. అందులో ఎసైన్డ్, ప్రభుత్వ, పట్టా భూములు ఉన్నాయి. అత్యధికంగా నిజాంపట్నం మండలంలో 10 వేల ఎకరాలకు పైగా తీసుకున్నారు. ఎసైన్డ్, పట్టా భూముల రైతులకు పరిహారాన్ని అందజేశారు. అయితే.. వాన్‌పిక్ ప్రాజెక్టులో అక్రమాలు జరిగాయని సీబీఐ కేసులు నమోదు చేయడంతో ప్రాజెక్టు నిలిచిపోయింది.

# ఓబులాపురం మైనింగ్ కేసులో శ్రీలక్ష్మికి సుప్రీం నోటీసులు

ఢిల్లీ : ఓబులాపురం మైనింగ్ కేసులో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మికి సుప్రీంకోర్టు నోటీసు జారీ చేసింది. గతంలో తెలంగాణ హైకోర్టు శ్రీలక్ష్మికి క్లీన్ చిట్ ఇవ్వడంపై సుప్రీంకోర్టును సీబీఐ ఆశ్రయించింది. జస్టిస్ ఏ ఎస్ బోపన్న, జస్టిస్ ఎం ఎం సుందరేశ్‌లతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. ఈ క్రమంలోనే శ్రీలక్ష్మికి నోటీసులు జారీ చేసింది. ఓబులాపురం మైనింగ్ కేసులో శ్రీలక్ష్మిపై సీబీఐ నమోదు చేసిన అభియోగాలను తెలంగాణ హైకోర్టు కొట్టివేసింది. తెలంగాణ హైకోర్టు ఉత్తర్వులను సవాలు చేస్తూ అత్యున్నత న్యాయస్థానాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ ఆశ్రయించింది. గనుల కేటాయింపులుల్లో ఓబులాపురం మైనింగ్ కంపెనీకి అయాచిత లబ్ది కలిగించారని శ్రీలక్ష్మిపై ఆరోపణలు వచ్చాయి. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా శ్రీలక్ష్మి ఉన్నారు. జగన్మోహన్ రెడ్డి అక్రమాస్తుల కేసుల్లోనూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. పెన్నా సిమెంట్స్‌కు అక్రమంగా లబ్ది చేకూర్చిన కేసులో జగన్‌తో పాటు శ్రీలక్ష్మి నిందితురాలిగా ఉన్నారు. పెన్నా సిమెంట్స్ కేసులో జగన్, ధర్మాన ప్రసాదరావు , పెన్నా ప్రతాప్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలతో పాటు అభియోగాలు ఎదుర్కొంటున్నారు. అనంతపురంలోని రిజర్వ్ ఫారెస్ట్ ఏరియాలో ఓబులాపురం మైనింగ్ కంపెనీ అక్రమ మైనింగ్ వ్యవహారాలపై సీబీఐ దర్యాప్తు జరిపింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శిగా శ్రీలక్ష్మి సుదీర్ఘ కాలం పని



చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పట్టణాభివృద్ధి శాఖ బాధ్యతలు నిర్వర్తించి సమర్ధ అధికారినిగా ఆమె పేరు తెచ్చుకున్నారు. తరువాత రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వ హయాంలో పరిశ్రమలు వాణిజ్య శాఖ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలోనే కుట్రకు పాల్పడ్డారని, అక్రమంగా మైనింగ్ లైసెన్సులు మంజూరు చేశారని శ్రీలక్ష్మిపై సీబీఐ అభియోగాలు మోపింది. గాలి జనార్దన్ రెడ్డికి చెందిన ఓఎంసీ కంపెనీకి లైసెన్సుల మంజూరులో శ్రీలక్ష్మి తన అధికారాన్ని దుర్వినియోగం చేశారని ఆరోపించింది. 1988 బ్యాచ్‌కు చెందిన శ్రీలక్ష్మి అక్రమ మైనింగ్ కేసులో 2011లో అరెస్ట్ అయ్యారు.

# అయ్యన్నపాత్రుడు, బుద్దా వెంకన్నలపై కేసులు నమోదు.. ఏ ఏ సెక్షన్ల కింద అంటే..

అమరావతి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర సందర్భంగా గన్నవరంలో బహిరంగ సభ నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సభలో ప్రసంగాలకు సంబంధించి తెలుగుదేశం నేతలపై కేసులు నమోదు అయ్యాయి. మాజీ మంత్రి పేర్ని నాని ఫిర్యాదు మేరకు అయ్యన్నపాత్రుడు, బుద్దా వెంకన్నలపై విడి విడిగా కేసులు నమోదు చేశారు. రంగుల రాణి రోజా మేకప్ చూస్తే రాత్రులు కూడా భయమేస్తుందంటూ అంటూ అయ్యన్న చేసిన వ్యాఖ్యలపై కేసు నమోదు అయ్యింది. ఇక ముఖ్యమంత్రిని ఆర్థిక ఉగ్రవాది, సైకో, ధన పిశాచి, పనికిమాలినవాడు అంటూ విమర్శలు చేశారని కేసు నమోదు చేశారు. అయ్యన్నపై 153%ఖు, 354A1(4), 504, 505(2), 509 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు కాగా.. బుద్దా వెంకన్న పై 153, 153A, 505(2), 506 ఐపీసీ సెక్షన్ల కింద కేసు నమోదు అయ్యింది. సభా వేదిక నుంచి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ ఆత్కూరు పోలీస్ స్టేషన్‌లో పేర్ని నాని ఫిర్యాదు చేశారు.

# తెలుగు చిత్ర పరిశ్రమకు నిజంగా గర్వకారణం




అమరావతి: తెలుగు సినీ పరిశ్రమకు జాతీయ అవార్డులు రావడం పట్ల ఏపీ బీజేపీ చీఫ్ దగ్గుబాటి పురందేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. "తెలుగు చిత్ర పరిశ్రమకు నిజంగా గర్వకారణం!!! పుష్పలో నటనకు గాను అల్లు అర్జున్ జాతీయ అవార్డు అందుకున్నందుకు అభినందనలు. అవార్డుల పుష్ప గుచ్ఛాన్ని అందుకున్నందుకు ఆర్ఆర్ఆర్ మొత్తం టీమ్‌కి అభినందనలు" అంటూ పురందేశ్వరి ట్వీట్ చేశారు. భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే జాతీయ చలనచిత్ర అవార్డుల్ని కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రకటించింది. 2021 ఏడాదికి గాను 69వ జాతీయ పురస్కారాలను కేంద్రం గురువారం వెల్లడించింది.


ఈ అవార్డుల్లో తెలుగు సినిమాలు సత్తా చాటాయి. తెలుగు సినిమా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటి చెప్పాయి. అల్లు అర్జున ఉత్తమ జాతీయ నటుడిగా అవార్డ్ అందుకొని.. 69 ఏళ్ల చరిత్రలో ఈ ఘనత సాధించిన తొలి తెలుగు నటుడిగా సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఇక ఆర్ఆర్ఆర్ చిత్రం జాతీయ పురస్కారాల్లోనూ సత్తా చాటింది. ఏకంగా ఆరు విభాగాల్లో అవార్డుల్ని సొంతం చేసుకుంది. ఉప్పెన సినిమా, దేవిశ్రీ ప్రసాద్సంగీతం, చంద్రబోస్ సాహిత్యం.. ఇలా మొత్తంగా ఓ 10 అవార్డులు తెలుగు సినిమా ఇండస్ట్రీ సొంతమయ్యాయి. జాతీయ చలన చిత్ర అవార్డుల్లో తెలుగు సినిమాకు పలు అవార్డు రావడంతో ఇండస్ట్రీకి చెందిన వాళ్లు సంబరాలు జరుపుకుంటున్నారు.

# 194వ రోజుకు యువగళం... వేంపాడు గ్రామ సమస్యలు విన్న లోకేశ

ఉమ్మడి కృష్ణా జిల్లా: టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర 194రోజుకు చేరుకుంది. శుక్రవారం నూజివీడు నియోజకవర్గం మీర్జాపురం క్యాంప్ సైట్ నుంచి 194వ రోజు పాదయాత్ర నారా లోకేష్ ప్రారంభించారు. పాదయాత్రలో భాగంగా యువనేతను వేంపాడు గ్రామస్తులు కలిశారు. నూజివీడు నియోజడకవర్గం గొల్లపల్లి శివారు వేంపాడు గ్రామస్తులు యువనేత లోకేశ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామ అగ్రహారంలో 3,356.23 ఎకరాల ఈనాం భూములు ఉన్నాయని.. గన్నవరం, నూజివీడు నియోజకవర్గాల్లో 5 గ్రామాలకు చెందిన 1,350 మందికి చెందిన భూములు ఇక్కడ ఉన్నాయని తెలిపారు. తమ గ్రామం నేటికీ సర్వే సెటిల్ మెంట్‌కు నోచుకోలేదని తెలిపారు. గ్రామ భూ సమస్యలపై స్థానికేతర భూస్వాములు సుప్రీంకోర్టు వరకు వెళ్లి పోరాడారని చెప్పారు. రైతులను ఇబ్బందులు పెడుతున్న జీఓలు 79, 102 లను రద్దు చేయించాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక వేంపాడు గ్రామ భూ సమస్యలను పరిష్కరించాలని గ్రామస్తులు వినతి చేశారు. నారా లోకేష్ స్పందిస్తూ.. ఈనాం భూములకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా




చాలాచోట్ల సమస్యలున్నాయన్నారు. కేసులు కోర్టుల్లో ఉండి న్యాయపరమైన చిక్కుల కారణంగా దీర్ఘకాలంగా రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక ఈనాం భూములకు సంబంధించి అధ్యయనం చేసి సముచితమైన నిర్ణయం తీసుకుంటామని లోకేశ్ హామీ ఇచ్చారు. ఈరోజు సాయంత్రం మామిడి రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో నారా లోకేశ్ పాల్గొననున్నారు.




# 28న ఎన్టీఆర్ 100 నాణెం విడుదల

హైదరాబాద్ : దివంగత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్ స్మారకంగా కేంద్రం 100 రూపాయల నాణాన్ని ఈ నెల 28న విడుదల చేయనున్నది. రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దీనిని విడుదల చేస్తారు. కార్యక్రమానికి హాజరుకావాలని నారా చంద్రబాబు, నందమూరి కుటుంబ సభ్యులకు ఇప్పటికే ఆహ్వానాలు అందాయి. ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ నాణాన్ని ముద్రించింది.




# జాబిల్లి ఉపరితలంపైకి రోవర్ దిగిందిలా.. వీడియో షేర్ చేసిన ఇస్రో

బెంగళూరు: జాబిల్లి దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 సురక్షితంగా దిగడంతో అంతరిక్ష రంగంలో భారత్ సరికొత్త చరిత్రను లిఖించింది. ఈ నెల 23న సాయంత్రం 6.04 గంటలకు చంద్రయాన్-3 ల్యాండర్ విజయవంతంగా చంద్రుడిపై కాలుమోపగా.. కొన్ని గంటల తర్వాత అందులో నుంచి రోవర్ బయటకు వచ్చి తన అధ్యయనాన్ని ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఇస్రో తాజాగా ఓ వీడియోను విడుదల చేసింది. ల్యాండర్ నుంచి రోవర్ జారుకుంటూ జాబిల్లి ఉపరితలంపైకి అడుగుపెట్టిన దృశ్యాలను పంచుకుంది.

గురువారం ఇస్రో మరో వీడియోను షేర్ చేసిన విషయం తెలిసిందే. "చంద్రుడిపై అడుగుపెట్టడానికి ముందు ల్యాండర్ ఇమేజర్ కెమెరా జాబిల్లి చిత్రాన్ని ఎలా క్యాప్చర్ చేసిందో చూడండి" అంటూ 2 నిమిషాల 17 సెకన్ల నిడివి ఉన్న వీడియోను పంచుకుంది.

**ఆ ట్వీట్ తొలగించిన ఇస్రో..** ఇదిలా ఉండగా.. ఇస్రో ఈ ఉదయం ల్యాండర్ గురించి ఓ అప్‌డేట్ షేర్ చేసింది. అందులో.. చంద్రయాన్-3 ల్యాండర్‌ను చంద్రయాన్-2 ఫొటో తీసిందని పేర్కొంది. "నా నిఘా నీపై ఎప్పుడూ ఉంటుంది. చంద్రయాన్-3 ల్యాండర్‌తో చంద్రయాన్-2 ఆర్బిటర్ ఫొటోషూట్. ప్రస్తుతం చంద్రుడి చుట్టూ ఉన్న కెమెరాల్లో చంద్రయాన్-2 ఆర్బిటర్‌లోని హై-రిజల్యూషన్ కెమెరాకు బెస్ట్ రిజల్యూషన్ ఉంది. చంద్రయాన్-3 ల్యాండర్ దిగిన తర్వాత తీసిన ఫొటోలు" అని ట్వీట్ చేసింది. అయితే, ఈ ట్వీట్‌ను కొద్దిసేపటి తర్వాత ఇస్రో తన అధికారిక ఖాతా నుంచి తొలగించింది. ట్వీట్‌ను ఎందుకు తొలగించిందనే దానిపై స్పష్టమైన సమాచారంలేదు.




# తెలుగు రాష్ట్రాల్లో ఆలయాలకు పోటెత్తిన భక్తులు

హైదరాబాద్ : శ్రావణ మాసం రెండో శుక్రవారం కావడంతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేపట్టారు. భద్రకాళి అమ్మవారి ఆలయంలో భక్తులు చేరుకుని పూజలు చేశారు. రాజరాజేశ్వరి ఆలయంలో కన్యకా పరమేశ్వరి గుడిలో అమ్మవారికి గాజులతో ప్రత్యేక అలంకరణ చేశారు. తూర్పుగోదావరి జిల్లా కడియం మండలం కడియపులంకలోని ముసలమ్మ తల్లి ఆలయంలో 13.25 లక్షల విలువైన కరెన్సీ నోట్లతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

# ఎన్టీఆర్ నా భర్త.. నాణెం విడుదలకు నన్నూ ఆహ్వానించండి




ఢిల్లీ : ఈ నెల 28న ఎన్టీఆర్ నాణెం విడుదలకు లక్ష్మీపార్వతికి ఆహ్వానం అందలేదు. దీంతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్లకు లక్ష్మీపార్వతి లేఖ రాశారు. ఎన్టీఆర్ రూ.100 నాణెం విడుదల కార్యక్రమానికి తనను ఆహ్వానించాలని లేఖలో లక్ష్మీపార్వతి కోరారు. ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమ ఆహ్వానితుల జాబితాలో తన పేరునూ చేర్చాలని లేఖలో పేర్కొన్నారు. ఎన్టీఆర్ తన భర్త అని, తన భర్త పేరుపైన నాణెం విడుదల చేస్తూ తనకు ఆహ్వానం పంపకపోవడం ఏమిటని ప్రశ్నించారు. బహుశా అధికారుల తొందరపాటు కారణంగా ఈ తప్పు జరిగి ఉండవచ్చని, తప్పును వెంటనే సరిదిద్దాలని కూడా లక్ష్మీపార్వతి లేఖలో పేర్కొన్నారు. 28న ఎన్టీఆర్ శతజయంతిని పురస్కరించుకొని రూ.100 నాణేన్ని కేంద్రం విడుదల చేస్తోంది. ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా ఎన్టీఆర్ నాణెం విడుదల కార్యక్రమం జరగనుంది. దీంతో కేంద్ర ప్రభుత్వం ఎన్టీఆర్ కుటుంబ సభ్యులందరికీ ఆహ్వానం పంపింది. కార్యక్రమానికి చంద్రబాబు, పురందేశ్వరి, బాలకృష్ణలతో పాటు పలువురు కుటుంబ సభ్యులు హాజరుకానున్నారు.

# నారా లోకేష్‌ను కలిసిన తుక్కులూరు గ్రామ దళితులు

కృష్ణాజిల్లా: టీడీపీ యువనేత నారా లోకేష్ యువగళం పాదయాత్ర 194వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ఉదయం నూజివీడు నియోజకవర్గం నుంచి పాదయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా నూజివీడు నియోజకవర్గం తుక్కులూరు గ్రామ దళితులు యువనేత లోకేష్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. తమ గ్రామంలో ఎస్సీలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారని, ప్రభుత్వం తమకు ఇళ్ల స్థలాలు ఇవ్వలేదని, డ్రైనేజీలు, రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పించడం లేదని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు రద్దు చేసి ద్రోహం చేసిందన్నారు. అలాగే సాంఘిక సంక్షేమ హాస్టల్ తొలగించారని, గురుకుల పాఠశాలలో వసతులు లేవన్నారు. ఎస్సీ, ఎస్టీ బ్యాక్ లాగ్ పోస్టులు భర్తీ చేయడం లేదని, ఎస్సీ, ఎస్టీలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక తమ సమస్యలను పరిష్కరించాలని లోకేష్‌కు విజ్ఞప్తి చేశారు.


**వారి సమస్యలపై స్పందించిన లోకేష్ మాట్లాడుతూ..** 'ఎన్నికల సమయంలో నా ఎస్సీలంటూ దళితులపై కపట ప్రేమ ఒలకబోసిన ముఖ్యమంత్రి జగన్ ఏరుదాటాక తెప్పతగలేసిన చందంగా' వ్యవహరిస్తున్నారని లోకేష్ విమర్శించారు. నాలుగేళ్లుగా దళితుల కోసం ఒక్క సంక్షేమ పథకాన్ని ప్రవేశపెట్టని జగన్.. గతంలో టీడీపీ అమలు చేసిన 27 ఎస్సీ సంక్షేమ పథకాలను రద్దుచేశారని మండిపడ్డారు. దళితులకు చెందాల్సిన ఎస్సీ రూ.28,147 కోట్ల సబ్ ప్లాన్ నిధులు




దారి మళ్లించారన్నారు. చరిత్రలో తొలిసారిగా రాష్ట్రంలో గత నాలుగేళ్లుగా దళితుల భూమి విస్తీర్ణం తగ్గిపోయిందన్నారు. పేద దళితుల ఉన్నత విద్యాభ్యాసం కోసం అమలు చేసిన అంబేద్కర్ విదేశీ విద్య పథకాన్ని అడ్డగోలు నిబంధనలతో నిర్వీర్యం చేశారని విమర్శించారు. తమకు జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించిన వారిపై దాడులు, హత్యలు చేయడం నిత్యకృత్యంగా మారిందని దుయ్యబట్టారు.

టీడీపీ అధికారంలోకి రాగానే జగన్ ప్రభుత్వం రద్దు చేసిన సంక్షేమ పథకాలన్నీ పునరుద్దరిస్తామని స్పష్టం చేశారు. ఎస్సీలకు పక్కా ఇళ్లు, దళితవాడల్లో డ్రైనేజీలు, రోడ్లు, మౌలిక సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీలపై జగన్ ప్రభుత్వం పెట్టిన తప్పుడు కేసులన్నీ ఎత్తివేస్తామని నారా లోకేష్ స్పష్టం చేశారు.

# ఈనెల 28న కేంద్ర ఎన్నికల కమీషన్‌తో చంద్రబాబు భేటీ




అమరావతి: కేంద్ర ఎన్నికల కమీషన్‌తో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు భేటీ కానున్నారు. ఈ నెల 28న మధ్యాహ్నం 3.30 గంటలకు భేటీ జరుగనుంది. ఈ మేరకు చంద్రబాబుకు కేంద్ర ఎన్నికల కమీషన్ అపాయింట్‌మెంట్ ఇచ్చింది. దీంతో 27న సాయంత్రమే టీడీపీ అధినేత ఢిల్లీ బయలుదేరి వెళ్లనున్నారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితాలో అక్రమాలపై సాక్ష్యాధారాలతో సహా చంద్రబాబు ఫిర్యాదు చేయనున్నారు.

తాజాగా బల్క్‌గా ఫామ్ - 7లు ఇవ్వ డం పై కూడా సాక్ష్యాలతో సహా కేంద్ర ఎన్నికల కమీషన్‌కు నివేదిక ఇవ్వాలని నిర్ణయించారు. దొంగ ఓట్లు, టీడీపీ ఓట్లు తొలగించడం, ఒకే ఇంట్లో 200 ఓట్లు వంటి అక్రమాలపై బీఎల్‌ఓలకు ఫిర్యాదు చేసినా వాటిని తొలగిం చడం లేదని టీడీపీ ఆందోళన వ్యక్తం చేస్తోంది. బీఎల్‌ఓలు, మండల అధికారులపై వైసీపీ నేతలు ఒత్తిడి తెస్తున్నారని తెలుగుదేశం చెబుతోంది. ఈ క్రమంలో వీటన్నింటిపైనా సాక్ష్యాధారాలతో సహా కేంద్ర ఎన్నికల కమీషన్‌కు చంద్రబాబు ఫిర్యాదు చేయనున్నారు.

## మణిరత్నం కథానాయిక అవ్వాలని నటినయ్యా!-అదితీరావ్ హైదరీ

భారతీయ సినిమా అనే పవర్ హౌస్ లో భాగమైనందుకు థ్రిల్లింగ్ గా గర్వంగా ఉందని అందాల కథానాయిక అదితీరావ్ హైదరీ అన్నారు. "నేను మణిరత్నం కథానాయికను కావాలనుకున్నాను. అందుకే ..నటిని అయ్యాను" అని కూడా తెలిపారు. ప్రయోగాలు చేస్తూ భాషతో సంబంధం లేకుండా వైవిధ్యమైన పాత్రలను పోషించేందుకు ఆసక్తిగా ఉంటానని తెలిపారు. "నేను ఎప్పుడూ సినిమాని హిందీ తమిళం అని చూడలేదు. నా దృష్టిలో ఏదైనా అద్భుతమైన దర్శకుల కథనం మాత్రమే. ఎవరైనా నటీనటులు సరైన సమయంలో సరైన స్థలంలో ఉన్నట్లయితే అద్భుతమైన దర్శకుల దృష్టిలో



భాగం అవుతారు. మణి సర్ తో నేను చేసిన సినిమా నా జీవితాన్ని అన్ని విధాలుగా మార్చేసింది" అని చెప్పింది. ఆన్ స్క్రీన్ ఇమేజ్ కి దశలు ఉన్నాయని చెప్పిన అదితీరావ్... పనిని ఎంచుకునే విధానంలో ఒక ప్రక్రియ ఉంటుందని తెలిపింది. ముందుగా దర్శకులను ఎంపిక చేసుకుంటాను. స్క్రిప్ట్ ను నాకు ఆఫర్ చేసిన పాత్రను చూస్తాను. అన్నీ కుదిరితే ఆ పాత్రను ఎంపిక చేసుకుంటాను. నేను ఎంపికల విషయంలో జానర్ లేదా భాషని చూడను. ఎంచుకునే దర్శకుడు.. కథను అనుసరించి దశలవారీగా ముందుకు వెళతామని కొంతవరకూ టైప్ కాస్టింగ్ జరుగుతుందని నేను నమ్ముతున్నాను. దర్శకులు తారల్ని ఒక నిర్దిష్ట మార్గంలో చూస్తారు. ఎక్కువ మంది అలా చూడాలనుకుంటున్నారు లేదా ఎక్కువ మంది దర్శకులు అలా ఉపయోగించుకోవచ్చని భావిస్తాను. ఇది అంత చెడ్డ విషయం అని నేను అనుకోను... అని అదితీ తెలిపారు.

## ఐదు ఫ్లాపులు అయినా తగ్గని అమ్మడి క్రేజ్..!

బుట్ట బొమ్మ పూజా హెగ్డేని మళ్లీ బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అమ్మడు చేసిన గత ఐదు సినిమాలు నిరాశపరచాయి. అందులో తెలుగు తమిళ సినిమాలు మూడు ఉండగా హిందీ సినిమాలు రెండు ఉన్నాయి. ప్రభాస్ తో రాధే శ్యాం సినిమా భారీ అంచనాలతో వచ్చి ఫ్లాప్ అయ్యింది. ఇక ఆ తర్వాత విజయ్ బీస్ట్ ఆశించిన స్థాయిలో అంచనాలను అందుకోలేదు. ఇక ఆ తర్వాత బాలీవుడ్ లో చేసిన సర్కస్ చరణ్ తో చేసిన ఆచార్య సినిమాలు విఫలమయ్యాయి. ఇక లేటెస్ట్ గా బాలీవుడ్ లో సల్మాన్ తో చేసిన కిసి కా భాయ్ కిసి కి జాన్ సినిమా కూడా అమ్మడికి నిరాశ మిగిల్చింది. బాలీవుడ్ లో హిట్ మేనియా కొనసాగించాలని చూస్తున్న పూజా హెగ్డే కలని కలగానే మిగిలింది. ఐదు ఫ్లాపులు ఉన్నా సరే అమ్మడి క్రేజ్ మాత్రం ఎక్కడ తగ్గట్లేదని చెప్పొచ్చు. ప్రస్తుతం త్రివిక్రమ్ మహేష్ కాంబో సినిమాలో పూజా నటిస్తుంది. ఇదే కాకుండా మరో స్టార్ హీరో సినిమాలో కూడా పూజా బేబీ ఛాన్స్ అందుకుందట. స్టార్ సినిమాల్లో ఫలితాలతో



సంబంధం లేకుండా అమ్మడు ఛాన్స్ లు అందుకుంటుంది. కెరీర్ మొదట్లో కూడా పూజా హెగ్డేకి మొదట ఫ్లాపులే పలకరించాయి. కానీ అల్లు అర్జున్ దువ్వాడ జగన్నాథం సినిమాతో అమ్మడి రేంజ్ మారిపోయింది. అంతకుముందు గ్లామర్ షో విషయంలో ఆలోచించిన పూజా డీజేలో తన గ్లామర్ షోకే ప్రేక్షకులు పడిపోయారన్న రీజన్ తో అమ్మడు వరుస సినిమాల్లో గ్లామర్ షో చేస్తూ వస్తుంది. పూజా థై షోకి సెపరేట్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉంది. అమ్మడు సినిమాలో ఉంది అంటే తొడల అందాల ప్రదర్శన చాలా కామన్ అనిపించేలా చేసింది. ఆ గ్లామర్ షో వల్లే అమ్మడికి సినిమాల రిజల్ట్ తో తేడా లేకుండా ఛాన్స్ లు వస్తున్నాయి. ఏది ఏమైనా ఒకటి రెండు ఫ్లాపులు పడితేనే అడ్రస్ లేకుండా పోతున్న హీరోయిన్స్ ఉండగా పూజా హెగ్డే మాత్రం హిట్లు వస్తున్నా మళ్లీ అవకాశాలను మాత్రం అందుకుంటూ ఫాం కొనసాగిస్తుంది. మహేష్ 28వ సినిమా హిట్ అయితే అమ్మడు మళ్లీ తిరిగి ఫాం లోకి వచ్చినట్టే.




## థైస్ అందాలతో మత్తెక్కిస్తున్న 'పైసా' బ్యూటీ



నాని హీరోగా నటించిన పైసా సినిమా లో హీరోయిన్ గా నటించి మెప్పించిన ముద్దుగుమ్మ సిద్ధికా శర్మ ఆశించిన స్థాయిలో సక్సెస్ లను సొంతం చేసుకోవడం లో విఫలం అయ్యింది. కానీ ఈ మధ్య కాలంలో సోషల్ మీడియాలో అందాల ఆరబోత చేస్తూ ఆకట్టుకుంటూ ఉంది.

సిద్ధికా శర్మ తాజా ఫోటోలు మత్తెక్కిస్తున్నాయి. థైస్ అందాలతో బోటమ్ యాంగిల్ లో ఈ అమ్మడు ఫోటోలకు ఫోజ్ ఇచ్చి ఆకట్టుకుంది. గతంలో పలు సార్లు ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఇలాంటి ఫోటోలు షేర్ చేసింది... కానీ ఈసారి అంతకు మించి అన్నట్లుగా ఆకట్టుకుంది. ఇక ఈమె సినీ కెరీర్ విషయానికి వస్తే గత సంవత్సరం నుండి బిజీ అయ్యింది. కెరీర్ ఆరంభంలో ఆకట్టుకోలేక పోయిన ఈ అమ్మడు ఇప్పుడు మాత్రం వరుస సినిమాల్లో నటిస్తోంది. ఈ ఏడాది ఈమె నుండి కనీసం మూడు సినిమాలు అయినా వచ్చే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం చేస్తున్న సినిమాలు మాత్రమే కాకుండా ఒకటి రెండు సినిమాలు చర్చల దశలో ఉన్నాయని తెలుస్తోంది. ఈ రేంజ్ లో అందాల ఆరబోత చేస్తే తప్పకుండా ముందు ముందు ఈమె మరిన్ని ఆఫర్లు దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి అంటూ ఇండస్ట్రీ వర్గాల వారు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## సాగరకన్యలా దివి పరువాలు.. స్టన్నింగ్ లుక్స్!



బిగ్ బాస్ తో ఫేమస్ అయ్యింది నటి దివి. అంతక ముందు కూడా పలు సినిమాల్లో నటించినప్పటికీ పెద్దగా గుర్తింపు రాలేదు. కానీ ఎప్పుడైతే బిగ్ బాస్ కి వెళ్లిందో ఆమె అందానికి ప్రేక్షకులు ముగ్దులైపోయారు. అప్పటి నుంచి ఆమెకు సోషల్ మీడియాలో క్రేజ్ మరింత పెరిగిపోయింది. ఆ తర్వాత పాపకు సినిమా ఛాన్స్ లు కూడా పెరిగాయనే చెప్పొచ్చు. స్టార్ హీరోలో సినిమాల్లో చిన్న చిన్న రోల్స్ చేస్తోంది. ఇటీవల చిరంజీవి గాడ్ ఫాదర్ సినిమాలో దివికి మంచి పాత్రే దక్కిందని చెప్పాలి. ఇటీవల పుష్ప2 లోనూ రిపోర్ట్ గా కనిపించనుంది. ఇటీవల రిలీజ్ చేసిన టీజర్ లో అలా తళుక్కున మెరిసింది. ఇలా పలు సినిమాల్లో ఛాన్స్ లు దక్కించుకుంటూ క్రేజ్ పెంచుకుంటోంది. ఈ అమ్మడుకి సినిమాల్లో కంటే సోషల్ మీడియాలోనే క్రేజ్ ఎక్కువ అని చెప్పాలి. ఈ అమ్మడు సోషల్ మీడియాలో ఫోటోలు షేర్ చేసిందంటే చాలు వైరల్ అయిపోవాల్సిందే. ఎప్పటికప్పుడు హాటు హాటు ఫోజులతో సోషల్ మీడియాను షేక్ చేస్తూ ఉంటుంది. తాజాగా ఈ హాట్ బ్యూటీ తన పుట్టిన రోజు సందర్భంగా స్పెషల్ కాస్ట్యూమ్ లో మెరిసింది. సాగరకన్యలా ముస్తాబై ఫోటోలకు ఫోజులు ఇచ్చింది. ఈ ఫోటోలు చూసి కుర్రాళ్లు గుండెలు జారిపోయాయి. పోస్టు చేసిన కొద్ది గంటలకే వేలల్లో లైకులు రాగా కామెంట్ల వర్షం కురుస్తోంది. దివి సూపర్ హాట్ క్యూట్ అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఆమె పుట్టినరోజు కూడా కావడంతో హ్యాపీ బర్త్ డే అంటూ కూడా విషెస్ తెలియజేస్తున్నారు. నిజానికి ఈ బ్యూటీది హైదరాబాదే. మొదట మోడల్ గా కెరీర్ ప్రారంభించింది. ఇప్పుడు చిన్న చిన్నగా సినిమాల్లోకి అడుగుపెడుతోంది. నెమ్మదిగా ప్రేక్షకులకు చేరువ అవుతోంది. త్వరలోనే ఈ బ్యూటీకి మరింత మంచి ఛాన్స్ లు రావాలని ఆమె ఫాలోవర్స్ కోరుకుంటున్నారు. ఇక మెగాస్టార్ భోళా శంకర్ లో అమ్మడు ఒక పాత్రలో నటిస్తోంది. మరి ఆ రోల్ అనంతరం కెరీర్ యూ టర్న్ తీసుకుంటుందో లేదో చూడాలి.

## పదహారేళ్ల వయసు పడి పడి లేచే మనసు


స్వచ్ఛమైన .. కలతలు.. గందరగోళం లేని వయసు ఏది? అంటే కచ్చితంగా టీనేజీనే. ఈ ఏజ్ ని గోల్డెన్ ఏజ్ తో పోలుస్తారు. ఇంతకీ టీనేజీలో సమంత ఎలా ఉండేది? ఏ మాయ చేశావే సమయానికి టీనేజీ దాటి ఇరవైల్లో అడుగుపెట్టింది. కానీ అంతకుముందు అంటే పదహారేళ్ల వయసులో ఎలా ఉండేదో చూసే భాగ్యం ఇన్నాళ్లు కలగలేదు. ఎట్టకేలకు ఆ కోరిక నెరవేరింది. తాజాగా సమంతా రూత్ ప్రభు తన 16 సంవత్సరాల వయస్సులో దిగిన త్రోబాక్ ఫోటోని ఇన్ స్టాలో షేర్ చేయగా అది వైరల్ గా మారింది. టీనేజీ మిసమిసల సామ్ ఎంతో ముగ్ధ మనోహరంగా సుకుమారంగా కనిపిస్తోంది ఈ ఫోటోలో. మెమరీ లేన్ లో విహరించి తన ఫోన్ మెమరీ నుండి ఈ క్లాసిక్ ఫోటోని వెలికితీసి 16 ఏళ్ల నేను అని



క్యాప్షన్ ఇచ్చారు. అందమైన డ్రెస్.. మెడలో పూసల దండలతో బోల్డ్ అప్పియరెన్స్.. సామ్ అమాయకమైన మోము తన అందాన్ని రెట్టింపు చేసింది. అలాగే ఈ ఫోటోలో మేకప్ గ్లిజ్ లేకుండా సమంత ఎంతో నేచురల్ గా కనిపిస్తోంది. సమంత కెరీర్ మ్యాటర్ కి వస్తే తన కెరీర్ లోనే సిటాడెల్ ఎంతో ప్రతిష్ఠాత్మకమైన సిరీస్. ప్రియాంక చోప్రా జోనాస్ సిరీస్ సిటాడెల్ ఆంగ్ల వెర్షన్ లో నటించగా.. భారతీయ వెర్షన్ లో సమంత నటించింది. వరుణ్ ధావన్ కథానాయకుడు కాగా రాజ్ అండ్ డికె ఈ సిరీస్ ని తెరకెక్కిస్తున్నారు. ది ఫ్యామిలీ మ్యాన్ మేకర్స్ తో సామ్ రెండవ సహకారమిది. సామ్ నటించిన శాకుంతలం బాక్సాఫీస్ వద్ద డిజాస్టర్ గా నిలిచింది. అయినా జయాపజయాలతో సంబంధం లేకుండా సమంత తన కెరీర్ రన్ కొనసాగిస్తోంది. తదుపరి డౌన్ టౌన్ అబ్బే సృష్టికర్త ఫిలిప్ జాన్ తో కలిసి అరేంజ్ మెంట్స్ ఆఫ్ లవ్ పేరుతో ఒక పోర్జెక్ట్ లో నటించేందుకు సిద్ధంగా ఉంది. ఈ ప్రాజెక్ట్ వివరాలు మరిన్ని వెల్లడి కావాల్సి ఉంది. అలాగే డిటెక్టివ్ ఏజెన్సీని నడిపించే యువతిగా డబుల్ రోల్ లోను నటించింది. ఏప్రిల్ 28న సమంత పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు అందే ప్రత్యేక కానుక ఏమిటో వేచి చూడాల్సిందే.

## తాడో పేడో తేల్చుకోబోతున్న పాయల్?

కొన్నేళ్ల కిందట 'ఆర్ఎక్స్ 100' అనే చిన్న సినిమా రేపిన సంచలనం అంతా ఇంతా కాదు. చిన్న సినిమాగా విడుదలై భారీ విజయం సాధించడంతో ఆ సినిమాలో భాగమైన అందరికీ మంచి పేరే వచ్చింది. అవకాశాలు వెల్లువెత్తాయి. హీరో కార్తికేయ వరుసబెట్టి సినిమాలు చేసేశాడు. హీరోగానే కాక విలన్గానూ నటించాడు. హీరోయిన్ పాయల్ రాజ్పుత్ సైతం బాగానే అవకాశాలు అందుకుంది. కానీ కార్తికేయ కొన్ని ఛాన్సులైనా ఉపయోగించుకున్నాడు కానీ.. పాయల్ కు మాత్రం తనకు వచ్చిన క్రేజ్ను ఏమాత్రం ఉపయోగించుకోలేకపోయింది. రెండంకెల సంఖ్యలో సినిమాలైతే చేసింది




కానీ.. ఒక్కటంటే ఒక్కటీ సరైన ఫలితాన్నివ్వలేదు. అగ్ర కథానాయకులు వెంకటేష్ రవితేజల సరసన నటించిన 'వెంకీ మామ' 'డిస్కో రాజా' చిత్రాలు సైతం ఆమె కెరీర్ కు ఎంతమాత్రం ఉపయోగపడలేదు. దీంతో చూస్తుండగానే ఫేడవుట్ అయిపోయింది పాయల్. ఇక పాయల్ కెరీర్ ముగిసిందనుకున్న తరుణంలో మళ్లీ ఆమెకు లైఫ్ ఇవ్వడానికి 'ఆర్ఎక్స్ 100' దర్శకుడు అజయ్ భూపతినే రంగంలోకి దిగాడు. తన రెండో సినిమా 'మహాసముద్రం'తో చేదు అనుభవం ఎదుర్కొన్న అజయ్.. తిరిగి తన రూట్లోకి వెళ్లిపోయాడు. స్టార్లను నమ్ముకోకుండా 'ఆర్ఎక్స్ 100' తరహాలో చిన్న నటీనటులతో కాన్సెప్ట్ బేస్ట్ మూవీ చేయడానికి సిద్ధమయ్యాడు. ఆ ప్రయత్నంలోనే 'మంగళవారం' అనే వెరైటీ సినిమా చేస్తున్నాడు. పాయల్ పనైపోయిందని జనాలు అనుకున్నప్పటికీ.. అతను ఆమెనే లీడ్ రోల్ కోసం తీసుకున్నాడు. 'ఆర్ఎక్స్ 100'లో కంటే బోల్డా సెన్సేషనల్గా పాయల్ పాత్రను అతను తీర్చిదిద్దాడని 'మంగళవారం' ఫస్ట్ లుక్ చూస్తే అర్థమైపోతుంది. పాయల్ కూడా ఈ సినిమాతో తాడో పేడో తేల్చుకుందాం అన్నట్లుగా అజయ్ ఎలా కోరుకుంటే అలా కనిపించడానికి నటించడానికి రెడీ అయినట్లుంది. ఈ సినిమా క్లిక్ అయితే పాయల్ మళ్లీ బిజీ కావచ్చు. లేదంటే ఆమె కెరీర్కు తెరపడవచ్చు.



## సచివాలయ ప్రాంగణంలో గుడి, చర్చి, మసీదును ప్రారంభించిన గవర్నర్, సీఎం

హైదరాబాద్: సచివాలయం ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన నల్లపోచమ్మ ఆలయంతో పాటు మసీదు, చర్చిని గవర్నర్ తమిళిసై, సీఎం కేసీఆర్ ప్రారంభించారు. సచివాలయానికి నైరుతిలో అమ్మవారితో పాటు శివాలయం, ఆంజనేయస్వామి ఆలయాలను నిర్మించారు. ప్రారంభోత్సవ వేడుకల్లో భాగంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన మహా పూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాల్లో తమిళిసై, కేసీఆర్ పాల్గొన్నారు. అనంతరం చర్చి, మసీదును ప్రారంభించారు. చర్చిలో గవర్నర్, సీఎం కేక్ కట్ చేశారు.

ఆ తర్వాత మసీదును ప్రారంభించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




హైదరాబాద్: తెలంగాణలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి సర్కార్ పచ్చజెండా ఊపింది. తెలంగాణలో డీఎస్సీ ద్వారా 5,089 ఉపాధ్యాయుల పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. 2,575 ఎస్జీటీ, 1,739 స్కూల్ అసిస్టెంట్, 611 భాషా పండితులు, 164 పీఈటీ పోస్టుల భర్తీకి అనుమతి మంజూరు చేసింది. ఈ మేరకు ఆర్థిక శాఖ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈసారి టీఎస్‌పీఎస్సీ ద్వారా కాకుండా గతంలో మాదిరిగా జిల్లా ఎంపిక కమిటీలు(డీఎస్సీ) నియామకాలు చేపడతాయని ఇప్పటికే విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. ఈ ప్రకారం టెట్‌లో క్వాలిఫై అయిన వారంతా టీఆర్‌టీకి పోటీ పడేందుకు అర్హులు. అందులో అర్హత సాధించిన వారి వివరాలతో జిల్లాలవారీ జాబితాను రూపొంచి డీఎస్సీకి పంపుతారు. అనంతరం ఆయా జిల్లాల డీఎస్సీలు నియామకాలు చేపడతాయని చెప్పారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) సెప్టెంబరు 15న నిర్వహిస్తామన్న ఆవె.. అదే నెల 27న ఫలితాల వెల్లడించనున్నట్టు తెలిపారు. ఆ తర్వాత వెంటనే నోటిఫికేషన్ జారీ అవుతుందన్నారు. అలాగే, కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లో ఇటీవలే కాంట్రాక్ట్ విధానంలో 1,264 బోధన, బోధనేతర ఖాళీలను భర్తీచేశామని.. ప్రాజెక్టు అయినందున కాంట్రాక్ట్ విధానంలో నియమించామని చెప్పారు. అయితే, కేజీబీవీల్లో సిబ్బందిని క్రమబద్ధీకరించడం కుదరదని మంత్రి తేల్చి చెప్పారు. గురుకులాల్లో 12,150 బోధన, బోధనేతర ఖాళీల భర్తీ ప్రక్రియ కొనసాగుతోందన్నారు.

**567మంది ఒప్పంద ఉపాధ్యాయుల క్రమబద్ధీకరణ :** సాంఘిక సంక్షేమ గురుకులాల్లో ఒప్పంద టీచర్లను క్రమబద్ధీకరణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒప్పంద టీచర్ల క్రమబద్ధీకరణకు ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో 567మంది ఒప్పంద ఉపాధ్యాయులను క్రమబద్ధీకరిస్తూ ఒకట్రెండు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయనుంది. 16 ఏళ్లుగా ఒప్పంద పద్ధతిలో కొనసాగుతున్న ఉపాధ్యాయులను క్రమబద్ధీకరిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం పట్ల మంత్రి కొప్పుల ఈశ్వర్ హర్షం వ్యక్తంచేశారు.

## కవితకు ఇస్తే.. 33 శాతం మహిళలకు టికెట్ ఇచ్చినట్లే: బండి సంజయ్



హైదరాబాద్: భారాస నేతల్లో చాలా మంది భాజపాలో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ అన్నారు. సర్వేలన్నీ భారాస ఓడిపోతుందని చెబుతున్నాయని చెప్పారు.

కవితకు కేసీఆర్ టికెట్ ఇస్తే 33 శాతం మహిళలకు టికెట్ ఇచ్చినట్లేనని ఎద్దేవా చేశారు. "ప్రకటించిన 115 మందిలో సగం మందికి సీఎం కేసీఆర్ బి ఫామ్ ఇవ్వరు. క్యాడర్‌ను కాపాడుకునేందకు కేసీఆర్ జిమ్మిక్కులు చేస్తున్నారు. భారాసకు 25 సీట్లు మాత్రమే వస్తాయని సర్వేలు చెప్తున్నాయి. 30 మంది కాంగ్రెస్ నేతలకు కేసీఆర్ డబ్బులిచ్చి బరిలోకి దించుతున్నారు. హిందువుల ఓట్ల కోసం కేసీఆర్ కొత్త నాటకాలు వేస్తారు" అని బండి సంజయ్ ఆరోపించారు.

## బీఆర్ఎస్ పార్టీ మొదటగా ఓడిపోయేది ఖమ్మంలోనే




ఖమ్మం: బీఆర్ఎస్ పార్టీ మొదటగా ఓడిపోయే జిల్లా ఖమ్మం అని బీజేపీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ పరిపాలన మీద ప్రజలు విసుగు చెందారన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కేసీఆర్ మళ్ళీ అధికారంలోకి రాకూడదని అన్ని వర్గాల ప్రజలు అనుకుంటున్నారని తెలిపారు. బీజేపీ తెలంగాణ రాష్ట్రంలో గెలిచి తీరాలని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్ షాలను ప్రధాని నరేంద్ర మోడీ ఆదేశించారన్నారు. 2019 తర్వాత తెలంగాణ రాష్ట్రంలో జరిగిన అన్ని ఎన్నికల్లో బీజేపీ గెలిచిందని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ అధికార దుర్వినియోగంతో అరకొరగా ఎక్కడో ఒక చోట గెలిచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ మాత్రం ఏ ఒక్క ఎన్నికలోనూ విజయం సాధించలేదన్నారు. సీఎం కేసీఆర్‌ను గద్దె దించాలి అంటే అది కేవలం బీజేపీతోనే సాధ్యమన్నారు. బీజేపీ సారథ్యంలో దేశం సుభిక్షంగా ఉందన్నారు. 27న మధ్యాహ్నం 2 గంటలకు సభ జరుగుతుందని ఆయన తెలిపారు.

## ఈఎస్ఐ కుంభకోణంలో చార్జిషీట్ దాఖలు చేసిన ఈడీ

హైదరాబాద్: ఈఎస్ఐ కుంభకోణం కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ చార్జిషీట్ దాఖలుచేసింది. రూ.211 కోట్ల స్కాం జరిగిందని అధికారులు నిర్ధారించారు. ఈ కుంభకోణంలో ఈఎస్ఐ మాజీ డైరెక్టర్ దేవికారాణితోపాటు మరో 15 మందిని నిందితులుగా పేర్కొంటూ అభియోగపత్రాలను సమర్పించారు. ఈఎస్ఐలో మందులు, మెడికల్ కిట్ల కొనుగోలులో గోల్‌మాల్ జరిగినట్లు దేవికారాణిపై ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో అవినీతి నిరోధక శాఖ కేసు నమోదుచేసింది. ఈ కేసు ఆధారంగా ఈడీ అధికారులు దర్యాప్తును ప్రారంభించారు. ఇప్పటికే నిందితులకు చెందిన రూ.144 కోట్ల ఆస్తులు ఈడీ అటాచ్ చేసిన విషయం తెలిసిందే.

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈఎస్ఐ మందుల కొనుగోళ్ల కుంభకోణం నిందితుల్లో దేవికారాణితోపాటు మాజీ జేడీ పద్మజ, షార్మాసిస్టు కే.నాగమణి, ఇద్దరు కాంట్రాక్టర్లు కే.శ్రీహరిబాబు, పీ.రాజేశ్వరరెడ్డి నిందుతులుగా ఉన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాల అమలు : మంత్రి నిరంజన్‌రెడ్డి



మహబూబ్‌నగర్ : రోజురోజుకు సాంకేతిక పరిజ్ఞానం పెరుగుతుండటంతో కొన్ని కుల వృత్తులు కనుమరుగవుతున్నాయి. చేతి వృత్తి దారులకు ఉపాధి కల్పించేందుకే సీఎం కేసీఆర్ లక్ష రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నారని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లాలో దివ్యాంగులకు 3016 రూపాయల నుంచి 4116 రూపాయలకు పెంచిన పింఛన్, బీసీ కుల వృత్తి దారులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జిల్లాలో 11వేల పై చిలుకు దివ్యాంగులకు పెంచిన పింఛన్ ప్రొసీడింగ్స్ అందజేశామన్నారు.

పార్టీలకు అతీతంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ సబ్బండ వర్ణాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి, సంక్షేమంలో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచిందన్నారు. రాబోయే ఎన్నికల్లో అభివృద్ధిని చూసి ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, తదితరులు పాల్గొన్నారు.



## ఆ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలి... గద్దర్ భార్యకు ప్రధాని మోదీ లేఖ

హైదరాబాద్: ప్రజాకవి గద్దర్ మృతిపట్ల ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. గద్దర్ మృతి తెలుసుకుని చాలా బాధపడినట్లు తెలిపారు. ఈ మేరకు గద్దర్ భార్య గుమ్మడి విమలకు ప్రధాని మోదీ లేఖ రాశారు. "తీవ్ర దుఃఖంలో ఉన్న ఈ సమయంలో కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతి తెలియజేస్తున్నాను. గద్దర్ పాటలు, ఇతివృత్తాలు సమాజంలోని బడుగు బలహీన వర్గాలు ఎదుర్కొంటున్న సవాళ్లను ప్రతిబింబిస్తాయి. గద్దర్ రచనలు ప్రజలకు ప్రోత్సాహాన్ని కూడా అందించాయి. తెలంగాణ సాంప్రదాయక కళారూపాన్ని పునరుజ్జీవింపజేయడంలో ఆయన చేసిన కృషి ప్రజలకు ఎప్పటికీ గుర్తుండిపోతుంది. మీ దుఖాన్ని మాటల్లో వ్యక్తపరచలేము. కుటుంబ సభ్యులకు, శ్రేయోభిలాషులకు ఈ దుఃఖాన్ని తట్టుకునే శక్తిని ప్రసాదించాలని కోరుకుంటున్నాను. ఓం శాంతి!" అంటూ ప్రధాని మోదీ లేఖలో పేర్కొన్నారు. కాగా.. ఈ నెల 6న ప్రముఖ విప్లవ కవి, ప్రజాగాయకుడు గద్దర్ కన్నుమూశారు. గత కొద్దికాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన అపోలో హాస్పిటల్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. ఈ విషయాన్ని గద్దర్ కుమారుడు సూర్యం అధికారికంగా వెల్లడించారు. రెండు రోజులక్రితమే ఆపరేషన్ సక్సెస్ అయ్యిందని వైద్యులు ప్రకటించారు. అంతలోనే ఈ విషాదవార్త వినాల్సి వచ్చింది. కాగా గద్దర్ అసలు పేరు విఠల్ రావు. అందరికీ గద్దర్‌గా సుపరిచితులైన ఆయన అసలు పేరు గుమ్మడి విఠల్ రావు.

## 27న ఖమ్మంలో అమిత్‌షా పర్యటన..



ఖమ్మం: కేంద్ర హెూం శాఖ మంత్రి అమిత్ షా ఖమ్మం పర్యటన ఈనెల 27న జరగనుంది. ఈమేరకు ఆయన పర్యటన విరాలను హెూంశాఖ కార్యాల యం విడుదల చేసింది. ఈనెల 27న ఉదయం 11గంటలకు ఢిల్లీ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 1:25కు విజయవాడ విమానాశ్రయానికి చేరుకుని.. అక్కడి నుంచి మధ్యాహ్నం 2:15 గంటలకు భద్రాచలం చేరుకుంటారు. 2:25గంటలకు రామయ్య దర్శనం అనంతరం అనంతరం 2:50కు హెలికాప్టర్‌లో బయల్దేరి.. 3:30కు ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలోని హెలిపాడ్‌కు చేరుకుని.. ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ కళాశాల మైదానంలో జరిగే బహిరంగసభలో పాల్గొంటారు. సా. 5:50 సభ ముగించుకుని హెలికాప్టర్‌లో విజయవాడ విమానాశ్రయానికి చేరుకుని.. ఢిల్లీకి తిరుగుపయనం కానున్నారు.

## రాష్ట్ర అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయి : మంత్రి ఎర్రబెల్లి



జనగామ : రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చేస్తున్న అభివృద్ధిని చూసి ప్రతిపక్షాలు భయపడుతున్నాయని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. ఇచ్చిన మాట ప్రకారం తండాలను నూతన గ్రామపంచాయతీలుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. జిల్లాలోని దేవరుప్పుల మండలం దారవత్ తండా గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ అధ్యక్షులు జగన్, సురేష్, అశోక్, సిద్దు అధ్వర్యంలో గౌతమ్, వినోద్, సందీప్, ప్రవీణ్, వెంకన్న, సతీష్, సాయి, సుమన్ , యాకు, శ్రీను, వంశీ, యాకన్న, రవి, హరీష్, నవీన్, చందర్,సోమన్న, సాయి రామ్, మంగర్, నిమా, భాస్కర్, నవీన్, రాజు, స్వామి, రమేష్, సోమన్న, స్వామి, తదితరులు మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ..ఎస్టీలను ఎన్నో రకాలుగా ఆదుకుంటున్నది దేశంలో ఒక్క సీఎం కేసీఆర్ ప్రభుత్వమేనని అన్నారు. పార్టీలో కొత్తగా చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని మంత్రి తెలిపారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ..సంక్షేమ పథకాలకు తాము ఆకర్షితులమై, అభివృద్ధిలో భాగస్వాములం కావడానికి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు.


రాబోయే ఎన్నికల్లో దయాకర్‌రావును అధిక మెజారిటీ తో గెలిపించేందుకు కృషి చేస్తామన్యనారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## వియ్యంకుడి సీటుతో పాటు 3 అసెంబ్లీ టికెట్లకు మాజీ ఎంపీ దరఖాస్?



రాజకీయ అనుభవం మహా అంటే పదేళ్లే.. ప్రజా ప్రతినిధిగా గెలిచింది ఒక్కసారే.. మాజీగా మారి కూడా ఐదేళ్లవుతోంది.. కానీ, ఆయనకు ప్రజల్లో ఉన్న పట్టు.. అభిమానుల ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. ఆయన పార్టీ మారితే వెంట భారీ నాయక గణమే వచ్చింది. ఇదంతా ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురించి. ఉమ్మడి ఖమ్మంలో తెలంగాణ అధికార పార్టీ బీఆర్ఎస్ కు ఒక్క సీటూ దక్కనివ్వనంటున్న ఆయన కాంగ్రెస్ లో చేరిన వెంటనే కార్యాచరణ మొదలుపెట్టారు. దీనికితగ్గట్లే ఆ పార్టీ కూడా ఆయనకు ప్రాధాన్యం ఇచ్చింది. కాగా, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం ఔత్సాహిక అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. 10 నియోజకవర్గాలకు గాను ఉమ్మడి ఖమ్మంలో ఉన్నవి మూడే జనరల్ స్థానాలు. అవి కొత్తగూడెం, ఖమ్మం, పాలేరు. వాస్తవానికి గత ఎన్నికల్లో పాలేరు, కొత్తగూడెంలలో కాంగ్రెస్సే గెలిచింది. దశాబ్దాలుగా ఈ నియోజకవర్గాలు ఆ పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉన్నవి. అలాంటిది కొత్తగూడెంలో గెలిచిన వనమా వెంకటేశ్వరరావు, పాలేరులో నెగ్గిన కందాళ ఉపేందర్ రెడ్డి బీఆర్ఎస్ లోకి వెళ్లిపోవడంతో కాంగ్రెస్ కు పెద్ద షాక్ అయింది. కాగా, జూలైలో కాంగ్రెస్ లో చేరిన పొంగులేటి తన వర్గానికి ఉమ్మడి ఖమ్మంలో 6 నుంచి 8 సీట్లు అడిగినట్లు ప్రచారం జరిగింది. ఇందులో వాస్తవం ఎంతో తెలియదు కాని.. ఆయన వర్గానికి సముచిత ప్రాధాన్యం దక్కడం మాత్రం ఖాయం. ఇక పొంగులేటి బుధవారం తాను ఖమ్మం, పాలేరు, కొత్తగూడెంలో పోటీకి ఉత్సాహంగా ఉన్నట్లు పీసీసీకి దరఖాస్తు సమర్పించారు. ఖమ్మం పక్కన ఉండే డోర్నకల్ కు చెందిన భూస్వామి రామసహాయ సురేందర్ రెడ్డి కుమారుడు రఘురామిరెడ్డి స్వయంగా పొంగులేటికి వియ్యంకుడు. సురేందర్ రెడ్డి పాతికేళ్ల కిందటే క్రియాశీల రాజకీయాల నుంచి తప్పుకొన్నారు. రఘురామిరెడ్డి రాజకీయాలలోనే లేరు. అయితే, కీలక ఎన్నికల ముంగిట రఘురామిరెడ్డి పాలేరు టికెట్ ను ఆశిస్తున్నట్లుగా తెలుస్తోంది. పొంగులేటి తరఫున అయితే ఇబ్బందులు వస్తాయని.. ఆయన పీపీసీ చీఫ్ రేవంత్ రెడ్డి కోటాలో ప్రయత్నాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. కానీ, తాజాగా పొంగులేటి పాలేరులో కూడా పోటీకి ఉత్సాహం చూపడం గమనార్హం. సామాజిక, రాజకీయ, భౌగోళిక సమీకరణాల రీత్యా పొంగులేటి శ్రీనివాసరెడ్డికి పాలేరు అయితేనే ఉత్తమమనేది ఓ అంచనా. ఖమ్మంలో మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ బీఆర్ఎస్ అభ్యర్థి. కొత్తగూడెంలో బీసీ మున్నూరు కాపు సామాజిక వర్గానికి చెందిన ఎడవల్లి క్రిష్ణ కాంగ్రెస్ టికెట్ రేసులో ఉన్నారు. మూడు జనరల్ స్థానాల్లో బీసీకి ఒకటైనా ఇవ్వాలి. బీఆర్ఎస్ అదే పనిచేసింది. క్రిష్ణ గతంలోనూ కొత్తగూడెంలో పోటీ చేసి ప్రభావం చూపారు. కొత్తగూడెం కాంగ్రెస్ అడ్డానే అయినా.. పొంగులేటికి అంత పట్టు లేదు. పాలేరులో మాత్రం అన్నీ అనుకూలాంశాలే కనిపిస్తున్నాయి.

## కుమిలిపోం.. మా సత్తా ఏంటో చూపిస్తాం



హైదరాబాద్: భారాస చేసిన తప్పుతో కుమిలిపోకుండా తమ సత్తా ఏంటో చూపిస్తామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు వెల్లడించారు. సమర శీల పోరాటాలు చేసి గ్రామగ్రామానా పార్టీని బలోపేతం చేస్తామని చెప్పారు. సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట్ రెడ్డితో కలిసి ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో కూనంనేని మాట్లాడారు. ఉమ్మడి 10 జిల్లాల్లోని 30 సీట్లలో సీపీఐకి 10 వేలకు పైగా ఓటు బ్యాంకు ఉందని తెలిపారు.

**సెప్టెంబర్ 17న భారీ బహిరంగ సభ :** "సెప్టెంబర్ 17ను బంగారు అక్షరాలతో చరిత్రలో లిఖించాల్సిన ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. భారాస అధికారంలోకి వస్తే సెప్టెంబర్ 17ను విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహిస్తామని గొప్పలు చెప్పారు. దీనిపై కేసీఆర్ తన విధానం స్పష్టం చేయాలి. చరిత్రను వక్రీకరించకుండా ఒక కమిటీ వేసి సమాజానికి అందించాలి. సెప్టెంబర్ 11 నుంచి మేం బస్సు యాత్ర చేస్తాం. హైదరాబాద్‌లో భారీ ర్యాలీ నిర్వహించి సెప్టెంబర్ 17న ఎగ్జిబిషన్ మైదానంలో బహిరంగ సభ నిర్వహిస్తాం. ఈ కార్యక్రమానికి సీపీఐ జాతీయ కార్యదర్శి రాజా ముఖ్య అతిథిగా హాజరవుతారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at Ratan Graphics D.No. 2-3-703/7, Ameerpet, Hyderabad - 500013 Telangana State and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State. Editor : V. VISHWANATH, M.A. Journalism
Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : garudavartha@gmail.com